# తమిళవేదము

(తిరుక్కుఱళ్)

రచయిత:

చల్లా రాధాకృష్ణశర్మ

1929-

ప్రథమ ముద్రణ : 1954
ద్వితీయ ముద్రణ : 1981
(మార్పుల చేర్పులతో)

294.11
23972

మూల్యము :
మూడు రూపాయలు

ప్రతులకు.

1. లక్ష్మీనారాయణ గ్రంథమాల:
   9, నాగార్జున నగర్,
   మదరాసు-600 024.
2. యువజన సేవాసంఘం:
   వెంగంపేట,
   కొలత్తూరు పోస్టు, 631 215.

ముద్రణ :
వెల్డన్ ప్రెస్,
68, మన్నప్ప మొదలి వీధి
మదరాసు-600 021.

రచయిత

కొంచెపు నీటిబిందువున
        గోచరమైన మహాతరుక్రియన్
సంచిత పుణ్యరాశి యనఁ
        జాలిన తావకభావజాల మ
భ్యంచితరీతిమై ద్విపద
        లందె కుదించి రచించినట్టి నీ
యంచిత పుణ్యమూర్తికి జో
        హారులివే - తిరువళ్ మహాకవీ ।

త్రవ్విన కొలంది చెలమ నేర్పడిన నీర
మట్లు, చదివిన కొలఁది భావైకరాశి
నలరు భవదీయ సత్కవితామృతాప్తిఁ
బారమే లేదు రసికప్రపంచమునకు.

—శ్రీ చల్లా లక్ష్మీనారాయణశాస్త్రి

# మనవి మాటలు

తమిళవాఙ్మయమును సుసంపన్న మొనర్చిన సాహితీ మూర్తులలో ప్రముఖుడు తిరువళ్లువర్. ఆయన ప్రసాదించిన తిరుక్కురళ్ తమిళవేద మని పేరు పెంపులు గడించినది. నాడును నేడును ప్రచుర ప్రచారములో ఉన్న యీ నీత్యుద్బోధక గ్రంథము సార్వకాలికము: సార్వలౌకికము.

తిరువళ్లువర్ గురించియు, ఆయన కృతిని గురించియు స్థూలారుంధతీ న్యాయముగా తెలియజెప్పుటయే యీ రచన ముఖ్యోద్దేశము. మార్పులు చేర్పులతో వెలువడుచున్న యీ రెండవముద్రణ కూడ తెలుగుపాఠకులను అలరించగలదని నా నమ్మకము. నేను చేయుచున్న తిరుక్కురళ్ తెలుగు నేత పూర్తి అనువాదము అచిరకాలములో వెలువడగలదని నమ్ముచున్నాను.

తెలుగు తమిళములు తోబుట్టు భాషలు. ఈ భాషల మధ్యగల చుట్టరికము నేటిది కాదు; బహు ప్రాచీనమైనది. ఈ చుట్టరికము ఇంకను బలపడవలెను. అందుకు అనువాదములే శరణ్యము.

ఈ పుస్తకము వెలుగు చూచుటకు అన్నివిధముల తోడ్పడిన వెంగంపేట యువజనసేవా సంఘమువారికిని, ఇందుకు వారిని ప్రోత్సహించిన మిత్రులు శ్రీ కొనిమేటి గంగయ్య శెట్టిగారికిని నేను మిక్కిలి కృతజ్ఞుడను.

ముద్దులు మూటగట్టు ముఖపత్రమును సమకూర్చిన ప్రసిద్ధ చిత్రకారులు శ్రీ గంగాధర్‌గారికిని, పుస్తకమును సర్వాంగసుందరముగా ముద్రించి యిచ్చిన వెల్డన్ ప్రెస్సు అధినేత శ్రీ టి. భావనారాయణ గారికిని కృతజ్ఞుడను.

—చల్లా రాధాకృష్ణ శర్మ

# తమిళవేదము

సారస్వతము సామాజికజీవనమునకు దర్పణము. ఇది ఉత్తమ సాహిత్యమునకు విశిష్టలక్షణముగా గణింపబడుచున్నది. మన ప్రాచీనులు సంతరించిన గ్రంథములు చాలవరకు నీతిప్రధానములుగాను, వేదాంతపరములుగాను ఉన్నవి. అలనాటి సామాజికజీవనవిధానమే అందులకు ముఖ్యకారణ మని పేర్కొన వచ్చును. ప్రాచీనభారతము ధర్మాసనము. ప్రాచీనభారతీయులు ధర్మపథావలంబకులు, ఆధ్యాత్మికసంపన్నులును కనుక వారు వెలయించిన గ్రంథములు నీతిప్రధానములుగా భాసించుటలో ఆవంతయు ఆశ్చర్యము లేదుగదా

సంస్కృతసాహిత్య సుందరోద్యానమున హితోపదేశ, పంచతంత్రములు, భర్తృహరి సుభాషితములు మున్నగునవి సౌరభములు వెలార్చు సుమరాజములు. మన తెలుగు వాఙ్మయములో ఆణిముత్యాలుగ గ్రహింపబడుచున్న శతక పద్యములును (భక్తి, నీతి, వైరాగ్య శతకాదులు), తత్త్వవేత్త అయిన వేమనార్యుని పద్యములును నీతి ప్రబోధకములుగాను, వేదాంతపరములుగాను రచింపబడినవే అనుట అత్యుక్తి కాదు అటులనే తమిళ సాహిత్యపు వినువీధిలో

ధ్రువతారవలె వెలుగొందుచున్న నీతిగ్రంథము తిరువళ్లువర్ ప్రసాదించిన తిరుక్కురళ్ అను గ్రంథరాజము!

**తిరువళ్లువర్ జీవితగాథ:**

దిగష్టకము నావరించు యశస్సును సముపార్జించిన తత్త్వవేత్తయు. మహాకవియు అయిన తిరువళ్లువర్ బహు ప్రాచీనుడు. ఆయన కాలము వివాదగ్రస్తముగా ఉన్నది. సంగ(ఘ) కాలపు* సాహిత్యవేత్తలలో ఆ మహాకవియును ప్రముఖుడని విశ్వసించు పండితులు కొందరు కలరు. మరి కొందరు క్రీస్తుశకము తొలి మూడు శతాబ్దులలో వళ్లువరు జీవించి యుండెనోపు నని భావించుచున్నారు. ఇదియే బహుళ ప్రచారము నందుకొనిన అభిప్రాయము. వళ్లువర్ కాలమును గురించి భిన్నవాదము లున్నట్లులనే కులమును గురించియు భిన్నవాదములు కలవు

*తమిళ వాఙ్మయచరిత్రలో తొలియుగము 'సంగ(మ) యుగము. ఆ యుగమున మూడు కవిసంఘములు వర్ధిల్లె నని తమిళ భాషాపండితులు అభిప్రాయపడుచున్నారు. ఈ సంఘత్రయము క్రీస్తునకు పూర్వమే వర్ధిల్లె ననియు వారి వాదము. ఈ సంగయుగము కేవలము ఊహాగానమని విశ్వసించు విద్వాంసులును కొందరు లేకపోలేదు. కనుక కొందరి మతము ననుసరించి తిరువళ్లువర్ క్రీస్తునకు పూర్వు డగుచున్నాడు. తిరుక్కురళును ఆంగ్లము లోనికి అనువదించిన రెవరెండ్ జి. యు. పోప్ 'క్రీస్తుశకము 800-1000 ప్రాంతమున తిరువళ్లువరు జీవించి యుండు నని తలచుచున్నాను' అని పేర్కొనిరి.

తిరువళ్ళువర్ శైవుడని కొందరును జైనుడని మరి కొందరును భావించుచున్నారు. అసలు ఈ కవి నిజనామధేయమే చరిత్రకు నేటికిని స్పష్టముగా తెలియరాలేదు. వళ్ళువర్[1] అను మాటకు వింతగొలుపు అర్థములు చెప్పబడినవి. పూర్వకాలమున గజముపై అధివసించి నగారా మ్రోగించుచు రాజాజ్ఞలను ప్రజలకు తెలియజేయువారు వళ్ళువు లని వ్యవహరింపబడెడివారట. వళ్ళువర్ ఈ వర్గమునకు చెందినవాడని కొందరి విశ్వాసము. ఆది[2] ద్రావిడులలో పురోహితవృత్తి నాధారముగ చేసికొని కాలము గడపు వారికి వళ్ళువులను వ్యవహారనామము కలదు. వారిలో శ్రేష్ఠుడగుటచే అతనికి తిరువళ్ళువర్ అనుపేరు కలిగెనని కొందరు సంభావించుచున్నారు. అతని ప్రభవమును గూర్చి ఉన్న ప్రమాణముగ నడచుచున్నకథ కూడ కొంతవరకు ఈ విషయమును బలపరచుచున్నది.

భగవాను డను బ్రాహ్మణుడు మఱియొక బ్రాహ్మ

1. వళ్ళువన్ అను మాటకు 'Tamil Lexicon' లో క్రింది అర్థములు ఉదాహరింపబడినవి.

A Paraiah caste, the members of which are Royal drummers, Priests for Paraiyas, One who foretells events by omens, An officer who proclaims the king's commands, The author of kural.

2. ఆది అస్పృశ్యులు.

ణుని గృహములో పెంపుడు కుమార్తెగా పెరుగుచున్న ఆది అను మాలపడుచును వివాహ మాడగా, ఆ దంపతులకు అవ్వై, ఉప్పై, అధిగమన్, ఉరువై, కపిలన్, వళ్ళి, వళ్లువన్-అను ఏడుగురు కలిగి రట ఈ కథను ప్రమాణ ముగా భావించి కొందరు తిరుక్కురళులోని తొలికురళును తమ వాదమునకు ఉపబలముగా ఉదాహరింతురు.

'అగర ముదల 'ఎళు(ఴు)త్తెల్లాం, ఆది
బగవన్ ముదట్రే ఉలగు.'

'ఆది అకారమ్ము అక్షరతతికి
ఆదియా భగవాను డఖిల జగతికి.'

గ్రంథాదిని తిరువళ్లువర్ కావించిన భగవన్నుతి యిది. అంతేకాని 'ఆది, బగవన్' అను మాటలను పురస్కరించు కొని వళ్లువర్ తొలుదొలుత తన జననీజనకులను సభక్తిక ముగ సంస్మరించినా డని పేర్కొనుట అసమంజసము అకారముతో అక్షరామ్నాయము ప్రారంభ మగును. అట్లనే యీ ప్రపంచమునకు భగవంతుడే ఆది (మొదటివాడు) ఈ అర్థమునే కురళ్ వ్యాఖ్యాత లందరును అంగీకరించిరి. కనుక జననిజనకుల పరముగ వ్యాఖ్యానించుట సమంజసము కాదు. తమిళమహర్షి అయిన కుఱుముని[1] (అగస్త్యుడు)

1. పొట్టివాడగుటచే ఆతనికాపేరు కలిగెను.

సంతతికి వళ్లువర్ చెందియుండవోపు నని కొందరు తలచు చున్నారు. ఆయన పాండ్యభూపతులకు రాజధాని అయిన మధురానగరమున జనన మందె నని కొందరును, మదరాసు నందలి మైలాపూరులో జన్మించె నని కొందరును భావించు చున్నారు తిరువళ్లువర్ ఆలయము ఒకటి మైలాపూరులో కలదు. ఇట్లు ఈ పుణ్యపురుషుని కులకాలాదికము వివాద గ్రస్తమై ఉన్నది. పై పెచ్చు ఫుక్కిటిపురాణములు తప్ప స్పష్టచారిత్రకాధారములు లభింపకపోవుట మరింత శోచ నీయము

వళ్లువర్ జీవిత వృత్తాంతము ఒక మధుర మనోహర గేయము. దుఃఖభూయిష్ఠముగా గణింపబడు సంసారము ఆయనకు స్వర్గతుల్య మనిపించెను సన్న్యాసముకంటెను గార్హస్థ్యమే మహోత్కృష్ట మైన దని ఆయన గడిపిన నిరా డంబరము, నిష్కల్మషము నైన జీవితము తెలివిడి చేయును.

నేతవృత్తిని ఆధారముగా చేసికొని వళ్లువర్ జీవిత యాత్ర సాగించెను మిత్రుడును, సముద్రవ్యాపారియు అయిన ఏలేలసింగన్[1] అనునతడు చేదోడు వాదోడుగ ఆయనకు సాయపడుచుండెను. ఉచితముగ నూలు నొసగుచు అతడు వళ్లువరును ఆదరపూర్వకముగ చూచెడివాడు ఆ నూలుతో

1. ఇతడు చోళరాజ వంశీయుడని మహావంశములో కలదట.
చూడుడు: V. V. S. Aiyar's 'The Kural'.

వస్త్రములు నేసి, అందువలన లభించు కూలిని మాత్రము వళ్లువర్ గ్రహించుచుండెను. సాంసారిక జీవనము సౌఖ్య ప్రదమై ఉండవలెనన్నచో సహధర్మచారిణి చల్లనిచూపులు ఆవశ్యకములు గదా ఈ మహాద్భాగ్యము తిరువళ్లువరునకు పూర్తిగా లభ్యమయ్యెను.

వళ్లువర్ సతీతిలకము సర్వవిధముల ఆయనకు అర్హమైనది భర్తృ మనఃప్రవృత్తిని పురస్కరించుకొనియే సంసారము సాగించినదా సాధ్వీలలామ. ప్రేమైకజీవులైన ఆ దంపతులకు సంబంధించిన రుచికరము లగు గాథలు కొన్ని ప్రచారములో కలవు.

వివాహాత్పూర్వము తనకాబోవు భార్య వినయ విధేయతలను వీక్షించు నుద్దేశముతో వళ్లువర్ ఆమెను 'ఇనుపముక్కలను ఉడుకబెట్టగలవా?' అనుచు గుప్పెడు ఇనుపముక్కలు ఆమె కొసగెను. తత్‌క్షణమే మారు మాటాడక గ్రహించుటయే కాక ఆమె వాటిని ఉడుకబెట్టె నట ఆ దృశ్యమును చూచిన తిరువళ్లువర్ సంతోష సంభరితు డయ్యెను. పిమ్మట ఆమెను సహర్షముగా వివాహ మాడెను ఆ సుగుణాలవాలతో ఆయన సౌఖ్యశ్రీలు అనుభ వించుచు సంసారయాత్ర సాగించుచుండగా - ఒకనాడు- సాంసారిక జీవనములో నిజముగా సౌఖ్యము కలదా? అనుచు ఒక సాధు పుంగవుడు వళ్లువరును సమీపించెను.

అప్పటికి ప్రత్యుత్తర మొసగక తన గృహమునందే కొంత కాల ముండు మని ఆ సాధువును వళ్లువరు కోరెను అత డును సమ్మతించెను.

ఒకనాడు చలిదియన్నము తినుచున్న సమయమున వళ్లువర్ భార్యను బిగ్గరగా పిలిచెను. అప్పు డామె పెర టిలో బావినుండి నీళ్ళు తోడుచుండెను. మగని పిలుపు చెవిని పడినదే తడవుగా ఆమె తోడుచున్న కుండను కూడ విడిచివైచి భర్తను సమీపించెను. 'ఈ చద్ది చాల వేడిగా ఉన్నది. కొంచెము విసరగలవా?' అని తిరువళ్లువర్ ఆమెను ప్రశ్నింపగా మారుమాటాడకయే లోనికి వెళ్లి, విసనకర్ర తెచ్చి ఆమె విసరనారెను. ఆశ్చర్యము ఆ యిల్లాలు విసురుచున్నంతసేపు ఆ చలిదియన్నమునుండి పొగలు దొంత రలు దొంతరలుగ పైకి వచ్చెనట పిమ్మట ఆమె బావి యొద్దకు వెళ్ళి చూడగా ఆమె విడిచివచ్చిన ఆ కుండ ఆ చోటనే ఉండెనట!

ప్రచారములో ఉన్న మరొక కథ.

ఒకప్పుడు పట్టపగలు తిరువళ్లువర్ వస్త్రము నేయుచు బుద్ధిపూర్వకముగా నాడెను క్రింద పడవేసి, 'నాడె క్రింద పడినది. దీపము తెమ్ము-' అని భార్యను పిలిచెను అప్పటి కప్పుడే దీపమును వెలిగించి ఆ దీపముతో ఆమె భర్తను సమీపించెను.

ఈ చిత్రాతిచిత్ర దృశ్యపరంపర సర్వసంగపరిత్యాగి అయిన ఆ సాధువునకు సంభ్రమాశ్చర్యములు కలిగించినవి. 'వళ్లువర్ భార్యవంటి సతీతిలకము లభ్యమగుచో నిజముగా సంసారము స్వర్గతుల్యమే. అటువంటి సాంసారిక జీవనము సన్న్యాసాశ్రమముకంటెను మహోత్కృష్టమైనది.' అని నిశ్చయమనస్కుడై వట్టి మాటలవలన గాక చేతల మూలముగ సమాధాన మిచ్చిన తిరువళ్లువరును సాధుపుంగవుడు మనసార కొనియాడెను.

ఇట్టి విశిష్టగుణసంపన్నమైన అర్థాంగి కాలధర్మము చెందినప్పుడు వళ్లువర్ హృదయము సహజముగా శోకార్ణవమయ్యెను అనిర్వచనీయమైన ఆ శోకమే పిమ్మట పద్యరూపమున మూర్తీభవించినది.

'తీయనిబువ్వకంటెఁ గడు
తీయనిదానవు, కాళ్ల లొత్తుచుఁ
రేయిఁ బరుండి తామసిలి
తేపకదఁ వడి లేచుదాన, వ
య్యో! యలినీలవేణి? యెటు
లోర్తును? నిన్నెడబాయు నాదు కం
దోయికి నిద్రపట్టదు-మ
నోహరభాషిణి! ప్రేమరూపిణీ!'

ఆధ్యాత్మికసంపన్నుడును, అమలినమనస్కుడును అయిన తిరువళ్లువర్ సంస్తుతిని సముపార్జించిన ఆ యిల్లాలి మధురనామము వాసుకి. ఆమె శ్రీమంతుడైన ఒక కర్షకస్వామికి గారాపుకూన. ఈ హృదయవిదారక సంఘటన సంభవించిన పిమ్మట వళ్లువర్ సన్న్యాసాశ్రమమును స్వీకరించెనట

## తిరుక్కురళ్ గ్రంథము :

మహాకవియు, తాత్త్వికుడును అయిన తిరువళ్లువర్ మహోన్నతభావములను గాని, ఆయన సందేశమును గాని తెలిసికొనవలయు నన్నచో తిరుక్కురళ్ గ్రంథ పరిశీలనము అవసరము ఈ గ్రంథమే ఆయనకు చిరంజీవిత్వమును ప్రసాదించినది. అంతే కాదు తిరువళ్లువరునకు నాయనార్ (పూజనీయుడు), దేవర్ (దైవము), ముదట్ పావలార్ (ఆదికవి), దెయ్‌వప్పులవర్ (దైవాంశము గలకవి), నాన్ ముగనార్ (చతుర్ముఖుడు), మాతానుభంగి (మాతృతుల్యుడు), సెన్నాప్పోదార్ (భాషాచతుర్ముఖుడు), పెరునావలర్ (మహావక్త), పొయ్యిల్‌పులవర్ (సత్యవాది) అను పేళ్ళు కలిగినవి అటులనే ఆయన రచన తిరుక్కురళునకు కూడ ముప్పాల్ (త్రివర్గము), ఉత్తర వేదము, దెయ్‌వనూల్, (దివ్యగ్రంథము), తిరువళ్లువర్ (తిరువళ్లువరు), పొయ్యామొళి (ఝి) (యథార్థకావ్యము), వాయురైవాళ్‌త్తు

(సద్విషయప్రశంస), తమిళ్ (ழ) మఱై (తమిళవేదము), పొదుమఱై (విశ్వజనీన వేదము), తిరువళ్లువప్పయన్ (తిరువళ్లువరీయము) అను నామాంతరములు ఏర్పడినవి.

సార్వజనీనము, సార్వకాలికము నైన యీ నీతి గ్రంథములోని సూక్తులు సుధారసోక్తులు. ఇందు వర్ణింపబడిన విషయములన్నియు సహజముగాను, స్వాభావికముగాను ఉండుటయేకాక యే మతప్రసక్తియు లేనివై కండ్లకు కట్టునట్లుగా ఉన్నవి ఈ హేతువుచే దీనికి లాటిను, ఇంగ్లీషు, ఫ్రెంచి, జర్మను మొదలగు పాశ్చాత్యభాషల యందును, [1] తెలుగు, మలయాళము, హిందీ మున్నగు ప్రాచ్యభాషల యందును ప్రశస్తములగు యథానువాదములు వెలసినవి

[1] ఫ్రాన్సిస్ వైట్ ఎల్లిస్ (1770-1819) తొలుదొలుత తిరుక్కురళు ప్రాశస్త్యమును గ్రహించి దానిని భాషాంతరీకరింప నిశ్చయించిరి. ఆయన ఒక కురళును సంస్కృతాంధ్రాంగ్ల కన్నడములలోకి పరివర్తించిరి.

తెలుగులో ప్రప్రథమమున కురళును అనువదించినవారు శ్రీ కనుపర్తి వేంకటరామ విద్యానంద నాథులు (1803-1898) సంస్కృతాంధ్ర ద్రవిడ భాషలలో పండితులైన కనుపర్తివారు శ్రీ విద్యామత ప్రచారకులు. ఆయన బాలకాలము తమిళ, కేరళ దేశములందే నివసించిరి. ఆయన తమ తెలుగు పేతకు 'త్రివర్గ ప్రదీపిక' అని పేరిడిరి. అర్థకందములో ధర్మార్థకాండము లను మాత్రమే తెనిగించిరి.

అటు పిమ్మట శ్రీయుతులు చొక్కం నరసింహులు నాయుడు, గరిమెళ్ళ సత్యనారాయణ, మడిగంటి జగన్నశాస్త్రి, పూతలపట్టు శ్రీరాములు

ఈ ఉద్గ్రంథమునకు సంబంధించిన ఐతిహ్యము ఒకటి కలదు. ప్రాచీనకాలమున - అనగా సంగములు వర్ధిల్లిన దినములలో - ఏ గ్రంథమైనను సరే విశేషవ్యాప్తిని గడింపవలయు నన్నచో అది సంగకవుల ఆమోదముద్రను పొందవలసియుండెను ఆమోద ముద్రాంకితములు కానివి చీకటిలోనే మ్రగ్గుచుండెడివి. మహాకవుల పరిశీలనార్థము తిరుక్కురళు 'మూడవసంగము' వారికి సమర్పింపబడెను. ఎందులకోగాని వారు దానిని ప్రామాణిక గ్రంథముగా పరిగణింపలేదు ఆ విషయమును తెలిసికొనిన ప్రసిద్ధ తమిళ కవయిత్రి అవ్వైయార్ కురళ్ గ్రంథ ప్రాశస్త్యమును సంగకవులకు విశదము గావించెను. అప్పటికిని వారు సమ్మతింపలేదు. కడపట తిరుక్కురళును ఒక 'పలక'పై ఉంచి, ఆ 'పలక'ను సంగకవుల సభాభవనము నందలి సరోవరమున పడవేసిరి. చూపరకు సంభ్రమాశ్చర్యములు కలుగునట్లుగా ఆ పలక పూర్తిగా నీట మునిగిపోయెను. తిరుక్కురళు

---

రెడ్డి, నాగపూడి కుప్పుస్వామయ్య, పెట్టి లక్ష్మీనరసింహం, కొంతి శ్రీపతి శాస్త్రి, చల్లా లక్ష్మీనారాయణశాస్త్రి, చె. రామలింగాచార్య ప్రభృతులు కురళును పూర్తిగానో కొంతవరకో తెలుగు చేసినారు శ్రీ విడుదవోలు వేంకటరావుగారు 'తెలుగు సాహిత్యములో తిరుక్కురళ్' అను వ్యాసమును 19.8 లో ఇండియన్ రిపబ్లిక్ వార్షిక సంచికలో ప్రకటించినారు.

ప్రబంధకవి శిరోమణి బిరుదాంకితులైన శ్రీ చల్లా లక్ష్మీనారాయణ శాస్త్రిగారి తెలుగు సేతలోని కొన్ని ద్విపదలను ఈ పుస్తకములో చేర్చితిని.

మాత్రము సురక్షితముగా కొలనిగట్టును చేరెను. అప్పుడు సంగకవులెల్లరు కురళును వేనోళ్ల కొనియాడి తిరువళ్లువరును కొండాడిరి. నాటినుండియు తిరుక్కురళ్ సర్వజన సమ్మత మును బడయుచు విశేషవ్యాప్తిలోనికి వచ్చెనట

ఈ కథలోని సత్యాసత్యములు ఆ సర్వసాక్షికే యెరుక ఏది ఎట్లున్నను నాడును నేడును తిరుక్కురళ్ పవిత్ర గ్రంథ మను ప్రజాసన్నుతిని గడించినది.

తిరుక్కురళ్ అనగా పవిత్రములగు పద్యములు. రెండు పాదముల చిన్న పద్యమునకు కురళ్ అనిపేరు అది సంస్కృ తము నందలి సూత్రరచనా విధానమును పోలియుండును. మొదటిపాదములో నాలుగు గణములును, రెండవపాదమున మూడు గణములును ఉండును కురళులో మొత్తము 1,330 పద్యములు కలవు. తమిళవేద మనబడు నీ గ్రంథమందలి భావములు అతి రమణీయములు, రసోదంచితములును. త్రవ్వినకొలది చెలమలో క్రొత్తనీరు ఉబికి యుబికి పైకి వచ్చునట్లుగా, చదివినకొలది ప్రతి కురళునందు నవనవో న్మేషభావములు స్ఫురితములగుచుండును. ఒక సహృద యుఁడు కురళును కొనియాడుచు ఇట్లనెను. "నీటిచుక్కలో ప్రతిబింబించు మహావృక్షము వలె మహోన్నతము, మనో జ్ఞమునైన భావము రెండు పాదముల పద్యములో కుదింప బడినది." అత్యుక్తి కాదిది.

ఈ గ్రంథము వెలసిననాటినుండియు నేటిదాక వ్యాఖ్యాన గ్రంథము లెన్నియో వెలసినవి. మణిక్కుడవర్, కాళింగర్, పరిప్పెరుమాళ్, పరిమేలళ(ఴ)గర్ మున్నగువారు ప్రాచీన వ్యాఖ్యాతలలో నుడువదగినవారు. వీ రందరిలోను పరిమేలఴగర్ తలమానికముగ భావింపబడుచున్నాడు. అతడు మేధాసంపన్నుడగు గొప్ప వ్యాఖ్యాత; వైష్ణవ బ్రాహ్మణుడు. పదునాలుగవ శతాబ్దమున జీవించియుండెను. కాంచీనగరము అతని నివాస స్థానము. కవిహృదయమును అవగతము చేసికొని వ్యాఖ్యానించుటలో అతడు కడు దిట్ట. సుస్పష్టము, సులలితము నైన అతని విపుల వివరణ గ్రంథ సాహాయ్యమున తిరువళ్లువర్ గంభీరహృదయము సువిదిత మగును. కావుననే నేటి పండితు లెల్లరు పరిమేలఴగర్ వెలయించిన వ్యాఖ్యానగ్రంథమును ఒరవడి గ్రంథముగా గణించుచున్నారు.

తిరుక్కురళ్లో ధర్మార్థకామములకు సంబంధించిన విషయములు వివరింపబడినవి. ఈ కారణముచే దీనికి ముప్పాల్ (త్రివర్గము లేక పురుషార్థత్రయము) అను పేరు కలిగెను. ధర్మార్థకామములు సక్రమముగ నిర్వర్తింపబడి నచో నాలుగవ పురుషార్థమైన మోక్షము అప్పుడు తనంతట తానే కలుగునని భావించి కాబోలు తిరువళ్లువరు మోక్ష మును స్పృశింపలేదు. దైవస్తుతితో ప్రారంభమైన ధర్మఖండ

ములో ప్రవృత్తి, నివృత్తి మార్గములు విశదీకరింపబడినవి. అర్థఖండమున రాజ్యాంగవిధానము, కోశపద్ధతి, మిత్రత్వము మున్నగు విషయములే కాక పాలకులకును పాలితులకును సంబంధించిన ముఖ్యాంశములు కూడ పేర్కొనబడినవి. కామఖండమునందు ప్రేమమూర్తులైన ప్రేయసీప్రియుల ప్రథమసమాగమము, దినదినాభివృద్ధి చెందు వారి స్నేహవల్లరి, పిమ్మట వారి పెండ్లి పేరంటములు, అనంతరము ఆ దంపతుల నడుమ విధివశమున కలుగు దుర్భరవియోగము, వియోగసంజనిత దుఃఖోద్వేగము - మొదలగు విషయములు కడు మనోజ్ఞముగ వర్ణితములు. తిరువళ్లువర్ కవితాశక్తిని, కల్పనాచాతురిని గ్రహించుటకు ఈ భాగము మిక్కిలి ఉపకరించును.

**ధర్మఖండము :**

ఈ ఖండములో రెండు ప్రధానభాగములు కలవు - గృహస్థాశ్రమము, సన్న్యాసాశ్రమము. వళ్లువర్ దృక్పథములో గృహస్థ జీవితము పరమోత్కృష్టమైనది. విధ్యుక్త ధర్మనిర్వహణము, అతిథిసత్కారము మున్నగునవి గృహస్థుని జీవిత సౌఖ్యశ్రీకి మూలహేతువులు. అట్లని సర్వసంగ పరిత్యాగ మొనరించి సాంద్రాటవీసీమలలో తప మాచరించు సాధువులనుగాని, సన్న్యాసాశ్రమమునుగాని వళ్లువర్ నిరసింపలేదు. వారును పూజ్యులే. వారి మహాత్త్వమును నిర్ణయింప

నభిలషించుట మృతశరీరుల సంఖ్యను లెక్కింప సమకట్టి విఫల మనోరథము చెందుట వంటిదే యగును.[1]

మానవసంఘములో గృహస్థునకు విశిష్టస్థానము కలదు. బ్రహ్మచారులకును, వానప్రస్థులకును, సన్న్యాసులకును, దిక్కులేని వారికిని, దరిద్రులకును, నిస్సహాయులైన మృతశరీరులకును[2] గృహస్థు మిత్రుడును, ఆధారభూతుడును అగుచున్నాడు అతని విద్యుక్త ధర్మములు—మృతులకు పారలౌకిక క్రియలు నెరవేర్చుట, దేవతాప్రీత్యర్థము పూజా పురస్కారములు జరుపుట, దయాగుణము నవలంబించుట బంధువులకు సహాయ మొనర్చుట, స్వవిషయమై జాగరూకత వహించియుండుట-అనునవి. గృహస్థజీవితము ధర్మమునకు మారుపే రనియే చెప్పవచ్చును. ధర్మమును, ప్రేమయు గార్హస్థ్యమునకు లక్ష్యము లేకాక సత్ఫలితములును. విధ్యుక్త ధర్మములను సక్రమముగ నిర్వర్తించునట్టి గృహస్థు మానవ సంఘమున భగవంతుడుగ భావింపబడును.

ఇక వళ్లువర్ చిత్రించిన గృహిణి యెట్టిదో గమనింతము. సహధర్మచారిణి సుగుణాలవాల యైనచో దారిద్ర్యమునకు తావే లేదు, సుగుణసంపన్న కానప్పుడు ధనరాసు

1. కురళ్ 22.

2. దిక్కు లేక మరణించినవారికి పారలౌకికక్రియల నెరవేర్చుటచే గృహస్థు వారికి మిత్రు డగుచున్నాడు.

యుండి మాత్రము ప్రయోజన మేమి? సచ్ఛీల యగు సతీ తిలకము కంటెను సౌందర్యవంతమైన పదార్థమేది? తన శీలమును, పేరు పెంపులను సంరక్షించుకొనుచు, ప్రేమార్ద్ర నయనములతో భర్తను చూచుచు, ఆదాయము ననుసరించి వ్యయము చేయుచు నుండెడి గృహిణియే సహధర్మచారిణి. ఇతర దైవములనుకూడ పూజింపక, తన పతియే దైవ మని భావించి పూజించు స్త్రీ 'కురియుము' అన్నచో వర్షము కూడ కురియును గృహిణి ప్రవర్తనము గౌరవాపాదకముగ లేనిచో ఆగృహస్థు చూపరముందు గంభీరముగను, రీవిగను నడవలేడు. గౌరవనీయ మైన గృహిణి వరప్రసాదములలో కెల్ల శ్రేష్ఠము సత్సంతానము శ్రేష్ఠతమము. సత్సంతాన మును బడసిన సాధ్వి దేవలోకమున ఉన్నతస్థానమును సంపాదించును.

ప్రేమ, దాతృతాగుణము, కృతజ్ఞత, ఆత్మనిగ్రహము మున్నగువానిని గృహస్థు (మానవుడు) కలిగియుండవలెను. మృదువుగ మాటలాడవలయును. మధుర భాషణము, దయావీక్షణము—ఇవి భూరివిరాళము నొసగుట కంటెను శ్రేయోదాయకములు చల్లని చూపును, తీయనిమాటయు హృదయమునుండి వెలువడుచున్నవి, ధర్మమునకు కూడ నివాసస్థాన మదే. ఎల్లరకును మనోహ్లాదము కలుగునట్లుగా మాటాడువానికి దుఃఖమును అభివృద్ధి చేయు దారిద్ర్యము

సంభవింపదు. వినయ, మధుర భాషణములు మానవునకు సుభాషణములు. మధురిమము లొల్కు మాట లుండగా కటువుగా మాటలాడు వ్యక్తి చక్కగా పండినపండును విడిచి పచ్చికాయను కోరుకొనునట్లుగా ఉండును.

ఆత్మనిగ్రహ ప్రాశస్త్యమును వళ్లువర్ ఇట్టుల కొని యాడుచున్నాడు. ఆత్మనిగ్రహము స్వర్గమునకు దారి చూపును; నిగ్రహింపబడని వాంఛ అగాధ మగుచీకటి లోయను చూపును. గొప్పనిధి అని భావించి ఆత్మనిగ్రహ మును కాపాడుకొనవలయును. నీ మాటలలో ఒక్కటి యైనను సరే ఇతరుని బాధించినచో అప్పుడు నీ సద్గుణసంపద నశించి నష్టే యగును గాయము కొంతకాలములో మాని పోవును, కాని దుర్భాషణమువలన ఏర్పడిన గాయము ఎప్ప టికిని పచ్చిగానే ఉండును. మనోనిగ్రహము గల వ్యక్తిని సందర్శించుటకు ధర్మదేవత అతనియొద్దకే అరుదెంచును.

మానవుడు భూదేవివలె సహనశీలమును కలిగియుండ వలయును. భూమిలో గోతులు త్రవ్వువారిని కూడ భూదేవి క్షమించుచున్నది, గొప్పతన మన్నచో అదే దరిద్రులైన వారికి ఇచ్చునదే దాన మగుచున్నది. ఇతరులకు (దరిద్రులు కానివారు) ఏమి యిచ్చినను, అది అప్పిచ్చుట వంటిదే. మరణము కంటెను దుఃఖకరమైనది మరియొకటి లేదు, కాని ధర్మము చేయుటకు అశక్తుడైనవానికి మరణము దుఃఖ

కరము కాదు. బీదలకు దానధర్మములు చేసి యశస్సును పొందవలయును; దీనిని మించిన లాభము మరియొకటి మానవునకు కలుగబోదు.

సత్కీర్తులు తప్ప ఇతరము లేవియు శాశ్వతములుగా ఉండవు. చిరయశస్సు సముపార్జించిన వ్యక్తిని దేవతలు సైతము పొగడుదురు. దుష్కీర్తి లేనివారే నాలుగుకాలముల పాటు నివసించియుందురు, కీర్తి గడింపనివారే మరణింతురు.

దానశీలుడైన సజ్జనుని హృదయము గ్రామ మధ్యమున ఉన్న ఫలభరిత వృక్షము వంటిది. జలమయమైన తటాకము వలె దేశశ్రేయస్సును వాంఛించు సజ్జనుని సంపదలు పరులకు ఉపయోగపడుచుండును.[1]

---

1 'తనసర్వస్వము జీవన మ్మొరులకున్
దానమ్ముగా నిచ్చి స
జ్జనుఁ డెల్లప్పుడు భంగపాటు గనకే
సంతోషియై యుండుగా,
జనముల్ నల్దెసలన్ గృహస్థు
లయి నిచ్చల్ దన్ను సేవింప జీ
వన మర్పించు తటాక మొప్పదొకొ
భాస్వత్కీర్తి రాదేశ్వరా!'

ఈ పద్యము శ్రీ చల్లా లక్ష్మినారాయణ శాస్త్రిగారి 'అణిముత్యాలు' లోనిది. ఇటులనే కురళులోని కొన్ని మధురభావము లీ పుస్తకములో అందాలు దిద్దుకొనినవి.

ఇటుల గృహయజమాని అవలంబింపవలసిన వివిధ ధర్మములను, వాటి ప్రాముఖ్యమును వివరించిన పిమ్మట తిరువళ్లువ నాయనారు సన్న్యాసాశ్రమమునకు సంబంధించిన విషయములను పేర్కొనెను.

దయ, సత్యము, శాంతము, హింస చేయకుండుట- మున్నగువాటిని హస్తగతము చేసికొని సాధువు జీవయాత్ర చేయవలయును. మాంసాహారమును విసర్జింపవలయును. మాంసాహారముతో తన శరీరమాంసమును అభివృద్ధి చేసికొను వ్యక్తి యెట్లు జాలి చెందును? జీవహింస చేయకుండుటయు, మాంసాహారమును త్యజించుటయు వేయి యజ్ఞములు చేయుటకంటెను శ్రేయోదాయకములు. తపస్సంపన్నులైనవారు తమశ్రేయస్సును కోరి పాటుబడుచున్నారు, ఇతరులు కామమోహితులై తమకు తామే అపకారము చేసికొనుచున్నారు. తన్ను తాను జయించినవాడు సర్వజనుల సన్నుతికిని పాత్రుడగుచున్నాడు. బాహ్యస్వరూపమును బట్టికాక చేతలను బట్టి మానవుని మంచి సెబ్బరలు నిర్ణీతములు కావలయును; గురివిందగింజ ఒకవైపు చూచుటకు అందముగా ఉండును; మఱొకవైపు నల్లగా ఉండును. కామక్రోధములకు అతీతుడై సాధువు సత్యాన్వేషణము సలుపవలయును. సంశయాస్పదవిషయములనుండి విముక్తుడై సత్యమును కనుగొనిన వానికి మర్త్యలోకముకంటె స్వర్గమే

దగ్గరగా ఉండును. ఆశయే పునర్జన్మములకు హేతు వగుచున్నది. ఆశాపాశవిచ్ఛేదనమే పరమ నిధానము. దీనిని మించిన నిధి లేదు. ఆశను జయించినవారే విముక్తిని పొందుదురు, ఇతరులు కూడ పైకి స్వతంత్రులుగానే కనబడుదురు. కాని వారు నిజమునకు కష్టపరంపరకు లోనగుచుందురు.

విధికంటెను బలీయమైనది మరేదియు లేదు. దానిని తప్పించుకొనుటకు ప్రయత్నించినను ఫలము కలుగుట దుర్లభము. అదృష్టము బయటపడు సమయమునందు విధినిర్ణయము విదిత మగుచుండును. అదృష్టహీను డగు సమయమున సోమరితనము అతనిని ఆవహించును దుర్విధి శక్తి సామర్థ్యములను నశింపజేయును, అదృష్టము సమీపించుటకు ముందుగా అతనికి శుభములు కలుగుచుండును. విధి నిర్ణయము సరిగా లేనప్పుడు కోటీశ్వరుడు సైతము భోగభాగ్యములను అనుభవింపలేడు.

**అర్థఖండము :**

ధర్మఖండములో సాంసారికజీవనమును, సన్న్యాసాశ్రమమును వివరించినట్లుగా, అర్థఖండములో పాలకులకును పాలితులకును మధ్య ఉండవలసిన సన్నిహిత సంబంధము, వారి విధ్యుక్తధర్మములు మొదలైనవాటిని కడు మనోజ్ఞముగా వళ్లువరు చిత్రించెను. ఈ ఖండము నాటి రాజకీయ

జీవితమునకు దర్పణ మని నుడువవచ్చును. దైనందిన జీవితములో రాజకీయములకు కల ప్రాధాన్యము ఎట్టిదో తిరువళ్లువర్ స్పష్టము చేసినాడు.

సైన్యము, ప్రజలు, కోశము, ఉపదేశికవర్గము, సఖ్యసంబంధము, దుర్గములు—ఈ ఆఱును రాజునకు మిక్కిలి ఆవశ్యకములు. కోశమును అభివృద్ధిచేయుటను, సంరక్షించుటను, సద్వినియోగము చేయుటను రాజు చక్కగా తెలిసికొనియుండవలయును. కఠినోక్తులతో ప్రజను బాధింపగూడదు. తన్ను దూషించువారిని కూడ అతడు మన్నింపవలయును. అధర్మమును అరికట్టవలయును. పక్షపాతమును విడనాడి సమదృష్టితో న్యాయపరిపాలన మొనర్పవలయును. అట్టి పాలకుడు మానవ సంఘమున దైవముగా భావింపబడును; జ్యోతివలె ప్రకాశించును.

రాజు విజ్ఞానసముపార్జనములో అప్రమత్తుడుగా ఉండగూడదు. పండితుడు ఎచ్చటికి వెళ్ళినను తనతో బాటు సంతోషమును కూడ తీసికొని పోవుచుండును. కాని అతడు పోవునప్పుడు విచారమును వదలి వెళ్లుచుండును. భిక్షుకుని వలె, ఉపాధ్యాయుని సమక్షమున వినయ విధేయుడై అతడు సంచరించి విద్య నేర్చుట యుక్తము. విద్యావంతునికి మాత్రమే నేత్రము లున్నట్లు గణింపబడును. విద్యా విహీనునికి నేత్రము లున్నను అవి రెండు గాయములు.

శక్తిసంపన్నుడైనను రాజు దుర్గములలోనే ఉండుట అతనికి శ్రేయస్కరము. నీటిలో ఉన్నంతవరకును మొసలి సురక్షితముగా ఉండును. వెలుపలికి వచ్చెనేని అది శత్రువులకు ఒక ఆటవస్తువగుచున్నది. కులీనుడును, దోషరహితుడును, అపయశస్సునకు వెరచువాడును అగు పురుషుని మాత్రమే రాజు తన ఉపదేశికవర్గమున చేర్చుకొనవలయును. దురాశ లేనివాడు, దయగలవాడును, మేధాసంపన్నుడును అయిన పురుషుడే ప్రభుత్వోద్యోగమునకు అర్హుడు. అభిమానమును పురస్కరించుకొని కాక, మంత్రియొక్క శక్తిసామర్థ్యములను, సహనయుతమైన కార్యనిర్వహణమును గమనించి అతనిపై (ప్రభుత్వ) కార్యభారము వేయవలయును. విధ్యుక్తధర్మ నిర్వహణమునందు సిద్ధహస్తుడైన సేవకుని ఏవగించుకొను వానినుండి భాగ్యరేఖ తొలగిపోవును. ప్రతిరోజును రాజు ప్రతివిషయమును పరామర్శించి చూచుట మంచిది. ప్రభుత్వ కార్యాలయములు సక్రమముగా ఉన్నంత వరకు రాజ్యమునకు ఎట్టి ముప్పును వాటిల్లదు.

వర్షార్థము ఈ ప్రపంచము గగనవీథిని తిలకించుచున్నది; అటులనే తమ రక్షణార్థము ప్రజలు రాజదండమును చూచుచుందురు. ప్రజను ప్రేమార్ద్ర హృదయముతో పరిపాలించు పాలకులను రాచరికము విడనాడనే విడనాడదు. న్యాయపరిపాలనము సాగినచో సకాలవర్షములు కురియును;

సస్యసంపద వృద్ధి అగును. కరవాలము కాదు జయలక్ష్మిని తెచ్చునది; రాజదండము. అయితే అది యే ప్రక్కకును మొగ్గక నిట్టనిలువుగా ఉండవలయును. అధర్మపరుడైన రాజు క్రమ క్రమముగా రాజ్యరమను కోల్పోవుచుండును. అతని యైశ్వర్యము నశించుటకు కష్టచరితుల కన్నీరే కారణము. న్యాయపరిపాలనము కీర్తికి హేతువు; అధర్మపాలనము అపయశస్సునకు కారణభూతము. క్రూరుడైన కువలయేశుని పరిపాలనమునందు దరిద్రునికంటె ధనికుడే దురవస్థను పొల్పడుచున్నాడు. ధర్మయుతమైన పరిపాలనము లేనిచో ఆవుల పొదుగులలో పాలు ఎండిపోవును; బ్రాహ్మణుడు[1] తన విధ్యుక్తధర్మమును విస్మరించును.

ఈ ప్రపంచము దయాదాక్షిణ్యములకు కట్టువడియున్నది. ఈ దయాదాక్షిణ్యములే లేకున్నచో నేత్రములుండియు మానవునకు లాభము లేదు. చల్లనిచూపులే నేత్రములకు అలంకారములు. దయావీక్షణములు ప్రసరింపని కన్నులు గల మానవులు భూరుహతుల్యులు. అపకృతి యొనర్చిన వారిని కూడ దయతో మన్నించుటయే మహోత్కృష్టమగు గుణము. రాజనీతి శాస్త్రపరిజ్ఞానము, ఉపదేశిక వర్గము-

---

1. తిరువళ్లువర్ దృక్పథములో ఆధ్యాత్మిక సంపన్నులగు యోగులే బ్రాహ్మణులు; సర్వభూత సమదర్శిత వారికే అలవడును. బ్రాహ్మణులకు 'అన్దణర్' అని తమిళములో పేరు. 'అన్దణ్మై' అనగా కరుణ లేక జాలి.

ఈ రెండును రాజునకు కన్నులవంటివి. వార్తాహారులవలన రాజ్యాంగములో జరుగు విషయములను ఎప్పటి కప్పుడు తెలిసికొనుచుండవలయును; లేదేని ముప్పు సంభవించును. వారి మాటలను కూడ లెస్సగా పరీక్షింపవలయును. పరీక్ష చేయక యే వారిని నమ్మజనదు. భృత్యులను బహిరంగముగా సన్మానించగూడదు; ఇట్లు చేసినచో రాజు తన రహస్యము లను తానే బహిరంగము చేసినవా డగుచున్నాడు.

ఇది అసంభవము - అనుచు పనిదొంగవు కాకుము. శారీరకపరిశ్రమయే తగినంత బలము నొసగును. భోగమును వాంఛింపక, పరిశ్రమించుటకు అభిలషించునట్టి వ్యక్తి మిత్ర బృందమునకు గొప్ప అండగా ఉండును; అతడే వారి బాధలను బాపగలడు. పరిశ్రమయే సౌభాగ్యమునకు మాతృక. సోమరితనము బాధలకు కారణభూతము. అదృష్ట హీనుడుగా ఉండుటలో అగౌరవము ఏమియు లేదు; కాని పరిశ్రమించుటకు విముఖత్వము తెలిపినచో అది అగౌరవము నకు హేతువు. విధి సుముఖముగ లేకున్నను సరే, పరిశ్రమ తప్పక ఫలప్రద మగును. స్మితవదనుడవై దురదృష్టమును ప్రతిఘటింపుము. సౌఖ్యములే కాక కష్టములుకూడ ప్రకృతి సిద్ధములే అని విశ్వసించువాడు కష్టమునుచూచి భయపడడు. మంచిదినములలో ఎవడు భోగములను కోరడో అతడు చెడ్డదినములలో సంభవించు కష్టములనుచూచి బాధపడడు.

మంత్రి యీ క్రింది గుణములు కలిగియుండవలయును. శత్రువుల మధ్య భేదములు కలిగించుట, మిత్రులతోడి సంబంధమును సుస్థిర మొనర్చుట, విడిపోయిన వారిని సంఘటిత పరుచుట—మున్నగునవి. మంత్రి విద్యావంతుడై ఉండవలయును; ప్రజాశ్రేయస్సును వాంఛింపవలయును. పుస్తకజ్ఞానముతో పాటు లోకజ్ఞానమును కూడ గడించి తదనుగుణముగా ప్రవర్తింపవలయును. రాజు బుద్ధిహీనుడై ఉండవచ్చును; చీటికి మాటికి అడ్డు తగులుచుండవచ్చును. అయినను ఏది సమంజసమో, న్యాయయుతమో దానినే మంత్రి రాజునకు తెలియజేయవలయును. ప్రభువును కూలద్రోయవలయు నని కుట్ర పన్నునట్టి దుష్టమంత్రి యేడుకోట్ల శత్రువులకంటెను భయంకరుడు. శ్రోతలను వశముచేసికొనునట్లుగా సంభాషించు నేర్పు రాజకీయజ్ఞునికి ముఖ్యావశ్యకము. వాగ్మిత కలిగి సభాకంపనమును, తికమకయు చెందక ప్రసంగించు వ్యక్తిని వాగ్వివాదములో జయించుట దుర్లభము. తమ హృదయమును తక్కువ మాటలలో వ్యక్తీకరింప లేనివారు ఎక్కువగా మాటలాడ నభిలషింతురు. ఆర్జించిన విజ్ఞానమును ఇతరులకు వ్యక్తము చేయ లేనివారు వికసించియు సువాసనల విరజిమ్మలేని కుసుమతుల్యులు. కీర్తి, లాభముల నొసగని కార్యముల పట్ల విముఖుడవు కమ్ము. అన్యాయార్జితవిత్తముతో నివసింప నభిలషించుట వేడిచే సరిగా

గట్టిపడని మట్టి కుండలో నీటిని కాపాడ ప్రయత్నించుటవలె ఉండును.

తన ఆశయము ఫలోన్ముఖము చెందునప్పుడే కార్య సాధకుడు తదాశయమును బహిరంగము చేయును; అననుకూల కాలములో ఆశయమును వెల్లడిచేసినచో విఘ్నములు ఏమైనను సంభవింపవచ్చును. దీర్ఘచర్చలకు ఫలితము నిర్ణయమునకు వచ్చుటయే; నిర్ణయము జరిగినపిమ్మట దానిని కార్యరూపము లోనికి తీసికొని వచ్చుటకు జాప్యము చేయుట తగదు. పరిస్థితులు సుముఖముగా ఉన్నచో గమ్యస్థానమునకు సూటిగా పొమ్ము; పరిస్థితులు అననుకూలముగా ఉన్నచో ప్రతిఘటనము తక్కువగా ఉన్న త్రోవమూలముగా పొమ్ము. ముగింపబడని కార్యము, జయింపబడని శత్రుసైన్యము-ఇవి నిప్పురవ్వలతో సమానము. పురుషప్రయత్నము, త్రోవలోని అడ్డంకులు, లాభము-వీటిని లెస్సగా గమనించియే కార్యరంగమున ప్రవేశింపుము.

సద్వంశము, దయార్ద్రహృదయము, రాజులను వశము చేసికొను ప్రవర్తన-ఇవి రాయబారికి కావలసిన లక్షణములు. మేధాసంపత్తియు, పాండిత్యమును, మనోహరాకృతియు కలవాడే రాయబారములు సలుపుటకు అర్హుడు. అతడు స్థిరచిత్తుడై ఉండవలయును; నిష్కల్మష హృదయుడై ఉండవలయును. చంపుదు మని భయపెట్టినను

నిజమైన రాయబారి విధ్యుక్తధర్మమును విడనాడడు. నిప్పు దగ్గర కూర్చుండి చలి కాచుకొనువానివలె రాజునొద్ద మెలగువాడు రాజునకు అత్యంత సన్నిహితముగాను, చాల దూరములోను ఉండగూడదు. హృదయరంజకము లగు విషయములనే రాజునొద్ద మాటలాడుట మంచిది; అడిగినను సరే లాభరహితములైన వాటిని గురించి మాటలాడవలదు. ఒకని చూపుల నుండియే అతని భావములను నిర్ణయించు కుశలుని ఉపదేశికవర్గములో చేర్చుకొనుము.

నీ మాటలకు విలువకట్టుట నీకు తెలియునా? నీ శ్రోతలను లెస్సగా గమనింపుము; వారికి రుచించునట్లుగా మాటాడుము. విజ్ఞాననిధులైన పెద్దల ముందు అపజయము పొందుట ధర్మమార్గమునుండి పతనము చెందిన ట్లుండును. సర్వసమర్థులైన విమర్శకుల సమక్షమునందు పండితుని ప్రజ్ఞ ప్రతిభాసించును. నీకు తెలిసిన సర్వస్వమును పండితులయెడ ప్రదర్శింపుము; తెలియని విషయములను వారియొద్ద నేర్చుకొనుము. తాను చెప్పదలచుకొనిన విషయమును వ్యక్తమొనర్పజాలని పండితుడు విజ్ఞాననిధియైనను లాభమురవంతయు లేదు. పండితులే కావచ్చును; కాని సదస్సులయందు మాటాడుటకు భయభ్రాంతులైనచో అపండితులకంటెను వారు నీచముగ పరిగణింపబడుదురు.

పయిడిపంటలకు కాణాచియై, సాధువులకును, ధనికులకును నివాసస్థానమై విలసిల్లునట్టిదే దేశము. శత్రువులవలని

భయమును, కరవు కాటకములును, దేశద్రోహులును, హంతకులును, కలహించుకొను వర్గములును లేని దేశమే దేశము. ధనము, సస్యసౌభాగ్యము, సౌఖ్యము, భద్రత, రోగములవలని భయము లేకుండుట - ఈ యైదును రాజ్యరమకు సుభూషణములు. సరియైన పాలకుడు లేకున్నచో ఈ విశిష్టలక్షణము లన్నియు నిష్ప్రయోజనము లే. మిత్రత్వమును సంపాదించుటకంటెను కష్టతరమైనది మరియొకటి లేదు. యోగ్యులైనవారితోడి మిత్రత్వము ఉద్గ్రంథములను చదువుట వంటిది; వారిని సన్నిహితముగ అనుసరించినకొలది మనము వారియందలి వైశిష్ట్యమును గుర్తింపగలము. తరుచుగా సంధించుటయో, మిత్రత్వము నెరపుటయో కాదు కావలసినది; హృదయైక్యమే మిత్రత్వమును దృఢపరుచునది. చెడుత్రోవలనుండి మరల్చి మంచిత్రోవలను సూచించువాడును, కష్టదశలో ఆదుకొనువాడును అయిన మనుజుడే సన్మిత్రుడు. బాగుగా పరీక్షింపకయే స్నేహితులను దగ్గరకు చేర్చుకొనువాడు కష్టములను కూడబెట్టుకొనుచున్నాడు. మిత్రుడు తన పతనస్థితికి కారణభూతుడైనను సరే అతనిని సన్మిత్రుడు విడనాడడు. విద్యాధికుడైనను సరే శత్రువు తన హృదయమందలి ద్వేషమును చంపుకొనజాలడు. మిత్రుని వలె నటించుచు కమ్మగా మాటలాడినను ఒక్క నిమిషములో శత్రువు బయటపడిపోవును.

క్రూరుడును, శక్తిసామర్థ్యములు లేనివాడును, మిత్రులు లేనివాడును, మలినమనస్కుడును అయిన రాజును జయించుట శత్రువులకు సులభకార్యము. పిరికియు, అవివేకియు అయిన రాజుతో యుద్ధము చేయుటకు వైరివీరులు చాల సంతసింతురు. శత్రువులను మిత్రులుగా చేసికొనినచో అతని అధికారమునకు అంతము లేదు. తెలియనివారికి నీ కష్టములను తెలియజెప్పకుము. నీ అసామర్థ్యమును శత్రువుల కంటబడనీయకుము. చిన్నవిగా ఉన్నప్పుడే ముళ్లచెట్లను నరికివేయుము. అవి పెద్దవి యైనచో వానిని నరకుటకు పూనుకొను హస్తమునే నరికివేయును. రహస్యముగా పగ సాధించు శత్రువునుండి రక్షించుకొన ప్రయత్నింపుము. మిత్రునివలె నటించు వైరిని విశ్వసింపకుము. ఆత్మీయుడు కనుక విరోధి యైనచో, అతడు నిన్ను కష్టపరంపరకు గురి యొనర్చును. తన్ను ద్వేషించు వానితో కలసి మెలసి సంచరించువాడు కాలసర్పగత కుటీరములో నివసించిన ట్లుండును.

మహనీయుల మనస్సు నొప్పింపకుండుటయే తన్ను తాను సంరక్షించుకొను మార్గము. అధికారబలములు గల మనుజులతో బలహీనుడు వైరము తెచ్చుకొనుట మృత్యుదేవతను ఆహ్వానించుటవంటిది. ఆధ్యాత్మికశక్తి సంపన్నులగు వారి కోపపుచూపులు దేవేంద్రుడంతటి వానిని కూడ పదవీ భ్రష్టునిగా చేయును. భార్యను చూచి భయపడు వ్యక్తి మహనీయులకు సేవ చేయుటకు కూడ ధైర్యవిహీనుడై

ఉండును. కాంతాదాసులైన పురుషులు తమ స్నేహితుల మనోభీష్టములనుకూడ తీర్పలేరు; సత్కార్యము ఏదైననొక దానిని చేయజాలరు. స్వలాభపరాయణలై (ధనము కోరి) వశ మొనర్చుకొను వెలయాండ్రను సమీపింపకుము. వారి తోడి సరస సల్లాపములు దుఃఖమునకే దారి తీయును. ప్రేమ నటించుచు వేశ్య తన ప్రియుని కౌగిలించుకొనును; కాని ఒక చీకటిగదిలో తనకు తెలియని మానవుని మృతకళే బరమును తాకినట్లుగా ఆమె భావించును. తమ కాంతల యందు గౌరవాభిమానములు గల పురుషులు వెలయాండ్ర హస్తము నైన స్పృశింపరు. హృదయద్వయముగల స్త్రీ, (వెల యాలు) త్రాగుడు, నెత్తపలక – ఇవి యదృష్టహీను డగు మానవునకు సంతోషప్రదములుగా ఉండును. త్రాగుడునకు అలవాటుపడిన పురుషులు శత్రువులకు సులభప్రాయు లగు టయే కాక సంపదలనుకూడ కోల్పోవుదురు. ఉన్నధనమును వెచ్చించి మద్యము సేవించి తత్ఫలితముగా బుద్ధిమాంద్య మును తెచ్చుకొనుటకంటెను అవివేకము మరియొకటి లేదు. విషతుల్యమైన మద్యమును సేవించువారు నిద్రించువారితో సమానులు. జూదగాడు ఐశ్వర్య, పాండిత్యములనే గాక ఆహార వస్త్రములను కూడ కోల్పోవును.

భుజించిన ఆహారము జీర్ణమైన పిమ్మటనే భుజించు చున్నచో మందులతో అవసర ముండదు. మితముగ భుజించుట మంచిది. ఆకలి అగునప్పుడే భుజించు వ్యక్తిని

ఆరోగ్యము సమీపించును; అటులనే అధికముగా భుజించు వ్యక్తిని వ్యాధి సమీపించును. నగుమొగము, నరము లేని చేయి, తీయనిమాట, జాలిగుండె -ఇవి ఉత్తమ మనుజునిలో ఉండును. సద్వంశజులు ధనాశచే పేరు పెంపులను కోల్పోవరు. పర్వతమువలె గంభీరముగా ఉన్నవారు సైతము నీచ కార్యము చేసినచో తమ గొప్పతనమును కోల్పోవుదురు. మహత్కార్యసాధనకు పూనుకొనవలయు నను అభిలాషయే గొప్పదనము. తద్భిన్నమే స్వల్పత్వము. సర్వమానవులు నొకేరీతిగా జన్మించుచున్నారు; కాని వారి జీవన విధానములను అనుసరించి పేరుపెంపులు ఏర్పడుచున్నవి. అందరిని ప్రేమించుట, ఇతరుల తప్పులను గణింపకుండుట, నిజాయితి మున్నగునవి శీలమునకు స్తంభప్రాయములు. సచ్ఛీలసంపద గల వ్యక్తికి దారిద్ర్యము అవమానహేతువు కాదు.

రూపసామ్యముచే కాక సమాన గుణగణములచే మానవులు పరస్పరము ప్రేమించుకొందురు. ధర్మాభిరతులు, న్యాయాపేక్షితులు, ఉపకారశీలురు నైనవారిని ప్రపంచమే ప్రస్తుతించును. నవ్వుటయే తెలియనివారు ఈ ప్రపంచములో పగటివేళ కూడ చీకటినే దర్శింతురు. ధనమే సర్వస్వ మని తలచి యెవరికిని ధనసహాయము చేయని లుబ్ధుడు పునర్జన్మములో దయ్యమై పుట్టును. దరిద్రులకు రవంతయు ధనసహాయము చేయని వాని ధనము ఏకాంతమునందే వ్యర్థమై

పోయిన యువతి యౌవనము వంటిది. అవమానమునందలి భీతి ఉత్తములకు భూషణము గాదా? పురుష ప్రయత్నము, ఒకరినొకరు లెస్సగా అర్థము చేసికొనుట—ఈ రెండును కుటుంబ గౌరవమునకు హేతువులు. కుటుంబమును సక్రమముగా నడపుటకు సమర్థుడు లేకున్నచో, కష్టములు సంభవించి ఆ కుటుంబము తుదకు చితికిపోవును.

ఈ ప్రపంచమునందలి వృత్తులన్నిటికిని వ్యవసాయమే తలమానికము. వ్యవసాయదారుడే యీ ప్రపంచమునకు ఆహార మిడుచున్నాడు. కృషి సలుపని వారిని కూడ కర్షకుడే పోషించుచున్నాడు. కనుక అతడు సమాజమునకు అవసర మగుచున్నాడు. భూమిని దున్ని నివసించువారే నివసింతురు; తదితరులు ఒకరిపై ఆధారపడి యున్నారు. తమ్ము నర్థించువారికి 'నాస్తి' అనకుండ సహాయ మొనర్చువారు కర్షకులే. కర్షకుడు చేతులు ముడుచుకొని కూర్చుండిన సర్వ వాంఛలకు స్వస్తి చెప్పినవారు (సన్న్యాసులు) కూడ బాధలకు పాల్పడుదురు. భూమిని దున్నుటకంటెను దానిని బలము చేయుట ఫలప్రదము. విత్తులు చల్లిన పిమ్మట నీరు పెట్టుటకంటెను కాపుదల ఫలప్రదము.

పొలము పేరలుక గల పడతి వంటిది. ఆమెను సంతోష పరుపవలయు నన్నచో కర్షకుడు సదా పొలము పనులలో నిమగ్నుడై ఉండవలయును... అప్పుడే ఆమెకు

సంతోషము కలుగును. కృషి సలుపక తన పేదరికమును తలపోసికొనుచు విలపించు నట్టి నిర్భాగ్యుని చూచి పొలము పకపక నవ్వును. కస్సు బుస్సు లాడక సహర్షముగా ఇచ్చు నట్టి వారిని చూచి భిక్షుకుడు చాల సంతోషించును. భిక్షము వేయువా రున్నారు కావుననే భిక్షుకులు ఆ వృత్తిని స్వీకరించినారు.

కామ ఖండము:

ఈ ఖండము ఒక మధురమంజులకావ్యము. ప్రేయసీ ప్రియులు ప్రప్రథమమున కలసికొనినప్పుడు వారిలో ననురాగ మధురమైన భావము లుదయించును. పిమ్మటనే వారు వలపు నేస్తము లగుదురు. కాని విధివశాత్తుగా వియోగ మేర్పడు నపుడు వారు భగ్నహృదయు లగుదురు. తమ్ము చూచి యితరులు పరిహసించు చున్నారేమో అని తలచి తీరని మనోవ్యథ కూడ వారు చెందుదురు. ఈ వ్యథ యీ ఖండములో తిరువళ్లువర్ కవితా శక్తిని, కల్పనా చాతురిని పురస్కరించుకొని అందాలు దిద్దుకొనినది.

కనుచూపు మేరలో కనబడుచున్న ఆ బంగారు బొమ్మ[1] దేవత కాబోలు. లేక లావణ్యాలతిక కాబోలును.

1. ఆమె అనగా ప్రేయసి. అత డనగా ప్రియుడు. ప్రేమస్వరూపు లైన వారిరువురు తమ మనోభావములను స్మృతిపథమునకు తెచ్చుకొను చుందురు.

ఇతఃపూర్వము మరణమనగా ఏమో నాకు తెలియదు; ఇప్పుడు తెలియవచ్చినది. అది విశాల నేత్రములు గల వెలది రూపమును ధరించినది. ఆమె నిరాడంబరముగా ఉన్నది. కాని ఆమె నయనములు మాత్రము సమరము సాగించునట్టివిగా కనబడుచున్నవి. మద్యము సేవించిన పిమ్మటగాని మత్తు కలుగదు; కాని చూచినంత మాత్రముననే కామము కలుగుచున్నది. ఆమెకు రెండు చూపులు గలవు. ఒకటి నా హృదయమును గాయపరుచుచున్నది. మరియొకటి ఆ గాయమును మాన్పుచున్నది. ఆమె నన్ను చూచినది; పిదప తల వంచినది. అనగా మా యిరువురి మధ్య మొలకెత్తిన ప్రేమాంకురమునకు నీరు పోయుచున్నది. నేను ఆమెను చూచినప్పుడు, ఆమె భూమిని తిలకించును. ఆమెనుండి నేను దృష్టి మరల్చినచో, ఆమె నన్ను చూచి మృదువుగా నవ్వును. ఆమె నాయొద్ద ఉన్నప్పుడు జీవితము ఏర్పడుచున్నది; ఆమె సుదూరముగా ఉన్నప్పుడు మరణము సంభవించుచున్నది.

పూర్వము అతని చూపులే నాకు సంతోషజనకములుగా ఉండెడివి; కాని యిప్పుడో (వియోగ మేర్పడనున్న సమయమున) అతని కౌగిలి కూడ విచారజనకముగా ఉన్నది. అతడు నన్ను విడనాడినచో, తిరిగి మేము కలసికొందుమో లేమో! తాకిననే అగ్నివలన ప్రమాదము ఏర్పడును; కాని ప్రేమ[2] వలె, దూరముగాఉన్నప్పుడు అగ్ని దహింపజేయునా?

2. ప్రేమవలన విరహాగ్ని కలుగుచున్నది.

మిత్రరత్నములు లేనిచోట జీవితము గడపుట కష్టము. హృదయేశ్వరుని వియోగమునుపొంది జీవించుట కష్టతరము. ఈ దుర్భర వియోగదుఃఖమును అణచుకొనుట నాకు వీలు కాకున్నది; కాని యీ దుఃఖమునకు కారకుడైన ప్రియునితో ఈ విషయమును చెప్పుటకే సిగ్గుపడుచున్నాను. ప్రేమ సంతోషసాగరము వంటిది; కాని యీ వియోగ సంజనిత దుఃఖము ఆ సముద్రముకంటెను చాల పెద్దది. నా హృదయమువలె నా నయనములు కూడ అతని యొద్దకు పరువు లెత్తినచో, అవి అశ్రుజలధిలో ఈదులాడ నక్కర లేదు.

ఎందులకో యీ కన్నులు నేడు నాతో మొరపెట్టుకొనుచున్నవి! ఈ నయనములు నాప్రియుని చూపుటవలననే గదా నాకీ దుర్భరదుఃఖము కలిగినది. ముందు వెనుకలు చూడక నాడు చేసిన పనికి నేడు దుఃఖింపనేల? ఫలితమును సహనముతో అనుభవింప వలసినదే. అతడు దూరగతుడై ఉన్నప్పుడు నా కన్నులకు నిద్దుర పట్టుటలేదు; అతడు మరలివచ్చుచో అప్పుడును వీటికి నిద్ర పట్టదు. కావున ఎట్లు చూచినను బాధ అనుభవింపవలసినదే వీటిపని. నా ప్రియుని సాగనంపినది నేనే గదా. కనుక నాస్థితిని గురించి యెవరితో చెప్పుకొందును? ఒకరి నొకరు పరస్పరము ప్రేమించుకొనిన వారే విజయగర్వము చెందవచ్చును. ఇతరులు ప్రేమించి

మాత్రము ఏమి లాభము? భర్తచే ప్రేమింపబడని ప్రమదకు సౌఖ్య మననేమో తెలియదు. భర్తయొద్దనుండి ప్రేమ పురస్సరమైన సందేశములు పొందని మహిళ జీవితము సాగించుచున్నచో ఆమె కఠినహృదయ.

పూర్వస్మృతులను జ్ఞప్తికి తెచ్చుకొను నప్పుడు కూడ ప్రేమ సంతోషప్రదముగా ఉండును. మద్యముకంటెను అది మధురమైనది. మా సమాగమమునకు సంబంధించిన పూర్వస్మృతులను ఆధారము చేసికొనియే నేను ప్రకృతము మనుచున్నాను. పుష్పముకంటెను ప్రేమ మృదులాతి మృదులము. దాని మృదుత్వమును గ్రహించి సుకుమార ముగ సంరక్షించువారు కొద్దిమందియే. నన్ను చూచినప్పుడు ఆమె నయనములలో అసంతృప్తి ఉండెను; కాని నేను ఆమెను సమీపించినంతనే నాకంటెను ముందుగా ఆమెయే నా బాహువల్లరిలోనికి వచ్చినది.

అతడు నా సమీపమున ఉన్నప్పుడు అతనిలో దోషము లేమియు నాకు కనబడలేదు; అతనిని చూడని వేళలందు దోషములు తప్ప మరి యితరము లేవియు అతనిలో నాకు కనబడవు. ఈ హృదయమువలన ఏమి ప్రయోజన మున్నది? ఏకాంతముగా నేను ఆలోచనలయందున్నప్పుడు ఈ హృద యము నన్ను నమలి మ్రింగుచున్నది. ఆహారమును భుజించు నప్పటి కంటెను, అది జీర్ణమగునప్పుడే మధురముగా

ఉండును; అటులనే కౌగిలికంటెను ప్రణయకలహమే మధుర ముగా ఉండును.

ఇటుల తిరుక్కురళులో ధర్మార్థ కామములకు సంబంధించిన విషయములు పెక్కులు మనోజ్ఞముగ విశదీకరింప బడినవి. ఈ వివిధ విషయములు లౌకిక జగత్తునకు సంబంధించినవై యుండుట హర్షింపదగిన అంశము. తమిళ వేద మును పఠించిన పిమ్మట పఠితకు ఈ విషయాదికము ప్రధాన ముగ స్ఫురించును. పాలకులు, పాలితులు - అందరును - ధార్మికులై ఉండవలయును. అధర్మమార్గములో సంచరించి నప్పటికిని సౌఖ్యము కలిగినను, అధర్మమార్గము మాత్రము అనుసరణీయము గాదు. శాశ్వతసౌఖ్యమును ప్రసాదించు ధర్మపథమును అవలంబించుటయే మానవుని పరమాశయమై ఉండవలయును. మానవుని దుఃఖములకు కారణభూతములు కామ, క్రోధ, మోహములు. ఇవి విసర్జితములైన నాడే దుఃఖములన్నియు నశించును. తిరువళ్లువర్ ఈ విషయమును ఇట్లు స్పష్టము చేసెను.

"కామం, వెగుళి, మయక్క మివై మూన్డ్రిన్
నామం కెడక్కెడుం నోయ్."

[కామక్రోధమోహములు మానవునినుండి తొలగె నేని అతని యిక్కటు లన్నియు తొలగిపోవును.]

మహాతత్త్వవేత్తయైన తిరువళ్లువర్ దృక్పథములో కృషికుడే పరమపూజ్యుడు. ఈ విశాలవిశ్వమునకు ఆహార

మిడునది కర్షకుడే. అతడు సోమరి యైనచో ప్రపంచము బాధలకు గురి అగును. కనుకనే సేద్యవృత్తిని కొనియాడి నట్లుగా తిరువళ్లువరు మరి యే యితరవృత్తిని కొనియాడ లేదు. ప్రేయసీ ప్రియులు ఎట్లుండవలయునో తిరువళ్లువరు వర్ణించిన విధము కూడ పేర్కొనదగినదే. మనస్ఫూర్తిగా ఒకరి నొకరు ప్రేమించుకొని యుండవలయును. ప్రేమవల్లరి వారి హృదయము లను పందిళ్లమీాది కెగప్రాకవలయును. అట్టిదే పవిత్రప్రేమ. ఈ హేతువుచేతనే కాబోలు ప్రణయ కలహము కూడ తిరువళ్లువర్ కవికి మధురాతి మధురముగ ద్యోతక మయ్యెను.

తిరుక్కురళ్ స్వతంత్రగ్రంథ మనియు, దీనిపై సంస్కృతవాఙ్మయ ప్రభావ మేమియు లేదనియు కొందరు తమిళభాషాపండితులు నుడువుదురు. కాని సత్యాన్వేషణమే లక్ష్యముగా ఉంచుకొని తిలకించినచో పై మాటలు స్వభాషాభిమాన జనితము లని తెలియవచ్చును. తిరుక్కురళుపై సంస్కృతవాఙ్మయప్రభావము స్పష్టముగా కనబడుచున్నదని పేర్కొనినవారిలో ప్రథములు కీర్తిశేషులు శ్రీ వి. ఆర్. రామచంద్ర దీక్షితరుగారు.[1] వీరివలె కీర్తిశేషులు శ్రీ పి. టి.

1. శ్రీ దీక్షితరు మదరాసు విశ్వవిద్యాలయమున చరిత్ర, పురాతత్వ శాఖయందు ఆచార్యపదవి నలంకరించిరి. **Purana Index, Hindu Administrative Institutions, The Kural** అనునవి వీరిగ్రంథము లందు ముఖ్యములు.

శ్రీనివాస అయ్యంగారు[1] కూడ తిరువళ్ళువరు సంస్కృత పండితుడై ఉండ నోపు ననియు, సంస్కృతమందలి నీతి, అర్థశాస్త్రగ్రంథములను లెస్సగా అభ్యసించి యుండుననియు తలచిరి.

మనుస్మృతి, చాణక్యుని అర్థశాస్త్రము, హితోపదేశ పంచతంత్రములు, భర్తృహరి సుభాషితములు, కామందకుని నీతిసారము మున్నగువాటితో తిరువళ్ళువరునకు పరిచయము ఉండి యుండు నని భావింపబడుచున్నది. ధర్మఖండములో మనుస్మృతిని, అర్థఖండములో కౌటిల్యుని అర్థశాస్త్రమును, ఎడ నెడ హితోపదేశ, పంచతంత్ర, మహాభారతాదులను తిరువళ్ళువరు అనుసరించెను. చతుర్విధపురుషార్థములలోని ధర్మార్థకామములను మాత్రమే స్వీకరించి తద్విధముగ తన గ్రంథమును విభజించి, రచన సాగించుటకూడ తిరువళ్ళువరుపై సంస్కృతప్రభావ మున్నట్లు చెప్పకయే చెప్పుచున్నది. 'కురళ్' పద్యరచనా విధానము సంస్కృత సూత్రరచనా విధానమును పోలియుండుట కూడ పై విషయమునకు సాక్ష్యముగా ఉన్నది.

గృహస్థాశ్రమ ధర్మములను వివరించుచు వళ్ళువర్ ఇట్లు నుడివెను. "సదుద్దేశములు కలవాడును, ఆశ్రమత్రయమును (బ్రహ్మచర్య, వానప్రస్థ, సన్యాసాశ్రమములు)

2. 'History of the Tamils' పుటలు 589-95.

సంరక్షించువాడును అయిన మనుజుడే గృహస్థు." (కురళ్-41) ఈ అర్థమునే స్ఫురింపజేయు శ్లోకము మనుస్మృతి యందును కలదు.

'యస్మాత్రయోశ్యాశ్రమిణో
జ్ఞానే నాన్నేన చాన్వహం
గృహస్థే నైవ ధార్యంతే
తస్మాజ్జ్యేష్ఠాశ్రమోగృహి.'

మానవుడు కష్టపరంపరకు పాల్పడుటకు ముఖ్య హేతువులు కామ, క్రోధ, మోహములే అనియు, వీటిని త్యజించినప్పుడే అతడు కష్టములనుండి బయటపడు ననియు తిరుక్కురళ్ పేర్కొనుచున్నది (కురళ్ 360). ఇటులనే భగవద్గీతయందలి

'విహాయ కామాన్యస్సర్వాన్
పుమాం శ్చరతి నిస్పృహః
నిర్మమో నిరహంకార
స్సశాంతి మధిగచ్ఛతి.'

అను శ్లోకము నుడువుచున్నది. కామక్రోధ మోహములను విడనాడినవాడు శాంతిని పొందుచున్నాడని గీత పేర్కొను చుండగా, కష్టములనుండి విముక్తి పొందుచున్నా డని కురళ్ నుడువుచున్నది. కష్టజలధినుండి గట్టెక్కినపిమ్మట లభ్య మగునది శాంతియే.

కూర్మము తన అవయవములను లోనికి ముడుచుకొను చున్నట్లుగా మానవుడు ఇంద్రియవికారములను నిగ్రహించు కొనుచు ప్రజ్ఞావంతుడు అగుచున్నాడు—అని భగవద్గీత నుడువుచున్నది.

'యదా సంహరతే చాయం
కూర్మోఙ్గానీవ సర్వశః
ఇంద్రియాణీంద్రియార్థేభ్య
స్తస్య ప్రజ్ఞా ప్రతిష్ఠితా.'

ఇటులనే కురళు కూడ, కూర్మమువలె ఐదింటిని (పంచేంద్రియములు) ఒకటిగా ఎవడు చేయగలుగునో అతడు అన్నిలోకములందును కీర్తిని గడించుచున్నాడని పేర్కొను చున్నది. (కురళ్ 126)

అర్థఖండమునందు తిరువళ్లువరు పాలకులకు గురించి పెక్కు విషయములు పేర్కొనెను. రాజు సప్తాంగయుతుడై ఉండవలయునని కురళ్ నుడువుచున్నది. ఇటులనే వళ్లువరు నకు పూర్వుడైన చాణక్యుడు తన అర్థశాస్త్రమునందు సప్తాంగములను ఉదాహరించెను.

'స్వామ్యమాత్య జనపదదుర్గకోశ దండమిత్రాణి'— అమాత్య, జనపద, దుర్గ, కోశ, దండ, మిత్రములు రాజునకు ఆవశ్యకములు. అర్థశాస్త్రమును అనుసరించియే కాబోలు వళ్లువర్ కూడ

"పడై, కుడి, కూళ (ళ్) అమైచ్చు, నట్పరణాఱు
ముడైయా నరశరుళేఱు"[1]

అని సప్తాంగములను ప్రశంసించియున్నాడు.

ఆంధ్రభోజబిరుదవిరాజితుడగు శ్రీకృష్ణదేవరాయల వారు కూడ ఈ సప్తాంగప్రశంస చేసియుండుట గమనింపదగినవిషయము :

"స్వామ్యమాత్య, సుహృత్కోశజనపదబల
దుర్గములు స్వామి గలిగినఁ దొలుతఁ గలవు:
అంగి మఖ్యమైన నంగంబు లటకు మునుపె
చాల ముఖలౌట మనకు దృష్టంబు గాదె—"

ఇటుల సంస్కృతరచనములకును, తిరుక్కురళునకును పోలికలు కొన్ని కనబడుచున్నవి. సంస్కృత శబ్దములే కాక, సంస్కృత రచయితలు పోయిన పోకడలు కూడ తిరుక్కురళులో కనబడుచుండుటచే వళ్లువర్ కాలము భేదాభిప్రాయములకు పాల్పడుచున్నది. మీదు మిక్కిలి ఆయన జైనుడనియు ప్రబలవాదము కలదు. జైన, బౌద్ధాచార్యుల చల్లని చూపులవలననే తమిళవాఙ్మయమునకు ప్రాచీనత కలిగినది. తమిళ పంచకావ్యములుగా గణింపబడు సిలప్పదిగారం, మణిమేకలై, జీవకచింతామణి, నీలకేశి మున్నగునవి జైనబౌద్ధుల సారస్వతకృషికి ఫలించిన పూర్ణఫలములు.

---

1. పడై = సైన్యము, కుడి = ప్రజ. కూళ్ (ళ్) = ఆహారము, అమైచ్చు = మంత్రి. నట్పు = మిత్రత్వము, అరణ్ = గిరిదుర్గము, స్థలదుర్గము, వనదుర్గము, జలదుర్గము.

క్రీస్తుశకము 5, 6 శతాబ్దులలో జైనబౌద్ధమతము లును, శైవవైష్ణవములును దక్షిణాపథమున విశేషవ్యాప్తిలో ఉండెను. సాంస్కృతికముగా దాక్షిణాత్యులకును, ఔత్త రాహులకును సంబంధములు ఏర్పడిన దినము లవి. కావున సంస్కృతరచనలు వళ్లువర్ వంటి మహాత్మునకు పరిచిత ములై ఉండెననుట నిజమునకు దగ్గరి చుట్టముగానే ఉండును.

ఏది ఎట్లున్నను, తమిళ వేదముగా పేరు పెంపులు గడించిన తిరుక్కురళ్ స్వతంత్ర రచనవలె ప్రతిభాసించు చున్నది. ప్రాక్ప్రతీచీదేశీయుల ప్రస్తుతిని సముపార్జించిన మహాగ్రంథము తిరుక్కురళ్. కనుకనే అది సార్వకాలికము; సార్వజనీనము అనుట.

మహాకవి పాల్కురికి సోమనాథుడు

'అల్పాక్షరముల ననల్పార్థ రచనఁ
గల్పించుటయ కాదె కవి వివేకంబు.'

అని నుడివినట్లుగా, అల్పాక్షరములతో అనల్పార్థ రచన చేయుట ఒక్క మహాకవులకే వీలగును. రెండు పాదముల పద్యములో అలతి అలతి మాటలతో కొండంత భావమును కుదించి చెప్పిన ప్రతిభాగరీయస్కుడు తిరువళ్లువర్. ఏ త న్మహామూర్తి సంతరించిన ప్రశస్తనీత్యుద్బోధక గ్రంథము తిరుక్కురళ్. ఒక సహృదయుడు పేర్కొన్నట్లుగా అది 'రజత పాత్రలో పొదగబడిన స్వర్ణఫలము.' మరొక సహృద యుడు తిరువళ్లువర్ మహాకవిని విశ్వమానవ కవిగా అభి వర్ణించినాడు. ఇది అత్యుక్తి కాదు!

# తిరుక్కురళ్ తెలుగుసేత

[ఇందులో 126 కురళుల తెలుగుసేత చేర్చబడినది. మా నాయనగారు శ్రీ చల్లా లక్ష్మీనారాయణ శాస్త్రిగారు కొన్ని కురళులను తెలుగు చేసిరి. మరి కొన్నిటిని నేను తెనిగించితిని. ఎప్పటికైనను కురళు పూర్తి అనువాదమును తెలుగు పాఠకలోకమునకు సమర్పింపవలెనని నా కోరిక.

అనువాదము కొన్నిచోట్ల అంత సాఫీగా సాగలేదు. అయినను సహృదయులు ఈ తెలుగుసేతను ఆదరింపగలరని నా నమ్మకము.

లఘువ్యాఖ్య చివర, పాఠకుల సౌకర్యార్థము, మూలములోని కురళు సంఖ్య ఇయ్యబడినది.]

## ధర్మఖండము

<u>దైవస్తుతి</u>

ఆది అకారమ్ము అక్షరతతికి
ఆదియౌ భగవంతు డఖిల జగతికి.

ఈ కురళు తిరుక్కురళునకు శ్రీకారము చుట్టినది. అక్షర ప్రపంచము అకారముతో ఆరంభమగుచున్నది. అటులనే యీ ప్రపంచమునకు భగవంతుడే ప్రథముడు.

చదివిన ఫలమేమి సర్వజ్ఞు పుణ్య
పదముల భక్తితో ప్రణుతింపకున్న?

అన్నియు తెలిసిన ఆ భగవంతుని పాదములను భక్తితో సేవింపనపుడు, చదివిమాత్రము ఏమి లాభము?

హృదయాబ్జమున సంచరించెడు వాని
పదములు గొలిచిన నొదవు సంతసము. 8

భక్తుల హృదయములో నెలకొన్న ఆ భగవంతుని సేవించువారికి ఆనందము కలుగును.

భగవంతుని కొలుచువారికి తప్ప
మిగిలినవారికి వగ తీరు నొక్కొ! 10

దయామయుడైన ఆ భగవంతుని పాదసేవకులు తప్ప మిగిలినవారు చీకుచింతలను పోగొట్టుకొనలేరు.

## వర్ష ప్రశంస

వర్షమే నరునకు పతనభూతమ్ము
వర్షమే అతని సంపదకు మార్గమ్ము. 15

వర్షము వలన మానవుడు అభివృద్ధి చెందుచున్నాడు. అదియే అతని పతనస్థితికిని కారణమగుచున్నది.

నిలువ దీ లోకమ్ము నీరు లేకున్న
జలమున్న తపములు సాగునో యన్న. 20

వాన లేకున్నచో లోకము నిలువదు. విధ్యుక్తధర్మ నిర్వహణకును అది కారణ మగుచున్నది.

## యతి ప్రశంస

యతి మహత్వము కొనియాడెడి తలపు
మృతులను లెక్కింప బూనుటే యగును. 22

[illegible]రాగద్వేష రహితులైన యతుల మహిమను కొని యాడలేము. కొనియాడ దలచుట మరణించినవారిని లెక్క పెట్టుటకు ప్రయత్నించినట్లుగా ఉండును.

మంచి గుణాలను మలమీద వధివ
పించువారి యలుక-ఎంచ దుర్భరము. 29

మంచిగుణము లను కొండ నెక్కిన వారి కోపమును-ఒక్క క్షణమైనను-భరించుట కష్టము.

## ధర్మ ప్రశంస

ధర్మమే వరునకు ధర్మలాభ మొసగు
ధర్మమే వరమిచ్చి తనకు పేరొవగు. 31

ధర్మము వలన పుణ్యమేగాక సంపదయు కలుగు చున్నది.

ధర్మలాభము కంటె ధనమెద్ది జగతి
ధర్మనాశము కంటె తగు పాపమెద్ది? 32

ధర్మానుష్ఠానము వలన మంచి కలుగుచున్నది; దానిని మరచిన చెడు కలుగుచున్నది.

మనసులో చేర్పకు మలినత, ధర్మ
మవగా అదియె, పెర ఆడంబరమ్ము. 34

మనస్సులో మాలిన్యము లేకుండ చేయునదియే ధర్మము. కడమవి వట్టి ఆడంబరములే అగును.

## గార్హస్థ్యము

ధర్మసంబద్ధులై తవరు ముష్వరకు
నిర్మలు దౌగేస్తు విక్కంపు దిక్కు. 41

ధర్మమార్గములో ప్రవర్తించునట్టి బ్రహ్మచారులకును, వానప్రస్థులకును, సన్న్యాసులకును గృహస్థు నిజమైన దిక్కు. అనగా, మిగిలిన మూడు ఆశ్రమములో ఉన్న వారికి సహాయముగా ఉండువాడే గృహస్థు అగుచున్నాడు.

### సహచరిణి

పరదైవముం వీడి పతి గొల్చు దాన
కురియు మన్నంతనే కురియదే వాన. 55

ఇతర దైవములను గాక తన భర్తయే దైవ మని భావించు స్త్రీ కనుక 'కురియుము' అనగానే వాన కురియును.

కనగా సతికి వెరె కలదొకో రక్ష
తనదు శీలమ్మె పో తనకగు రక్ష. 57

స్త్రీకి రక్షణ మెవరున్నారు? ఆమె శీలమే ఆమెకు మంచిరక్షణ యగును.

### సంతానము

చిట్టి చేతులతోడ చిటిపాప కలుపు
పెట్టె దన్నమె సుధాప్రాయమ్ము గొలుపు. 61

చిన్నపిల్లలు కలిపెడు ఆ పట్టెడు మెతుకులే వారి తలిదండ్రులకు అమృతము కంటెను తీయగా ఉండును.

తనయుండు జనకుని కొనరించు మేలి
తని పొంద ఏమి నోచెనొ తండ్రి' యనుట. 70

కొడుకు తండ్రికి చేయవలసిన ఉపకారము ఏమనగా 'ఇతని తండ్రి యితనిని కొడుకుగా పొందుటకు ఏమి నోములు నోచెనో కదా;' అని యితరులు అనునట్లుగా చేయుట.

ప్రేమ

కోరుము రన్నియు కూర్మి లేకున్న,
కోరరు తమవైన కూర్మి గలారు. 72

ప్రేమ లేనివారు ప్రతివస్తువును తమ సొంతము చేసి కొన దలతురు. ప్రేమ కలవారు తమ శరీరమును కూడ పరోపకారార్థము వినియోగింతురు.

ప్రేమచే ఆసక్తి పెరుగు. ఆసక్తి
సౌమనస్యమ్మును సాధించు గాదె. 74

ప్రేమ కనుక లోపల ఉన్నప్పుడు, ఇతరులయందు అపేక్ష కలుగును. ఆపేక్షవలన అందరితోను సఖ్యముగా ఉండవలయు నను మంచి భావము కలుగును.

ధర్మమునకు ప్రేమ తావల, మది అ
ధర్మమునకు గూడ తావలమ్మగును. 76

తెలియనివారు ధర్మమునకు మాత్రమే ప్రేమ ఆధార మందురు. కాని అధర్మమునకు కూడ ఆ ప్రేమయే తోడగు చున్నది.

ఎడద ప్రేమ మొలవదేవి, వాని మను
గడ పట్టను చిగుర్చు పుడమి పుట్టుగడ. 78

లోపల ప్రేమ లేకుండ వ్యవహరించు వారి జీవితము చవిటినేలలో వట్టిపోయిన చెట్టు చిగిరించినట్లుగా ఉండును.

లోప ప్రేమ యొకింత లేనపుడు పయి
వాని వలన మేలు వాటిల్లు నొక్కొ. 79

లోపల ప్రేమ అనునది లేనప్పుడు, మిగిలిన అవయవము లన్నియు ఉండి మాత్రము మనిషి కేమి లాభము?

## సమస్థితి

కడు మంచిదైనను విడుచుట లెస్స,
నడి నిలుకడ లేని గడన వ్యర్థమ్ము. 113

ఎంత మంచిదైనను సరే లాభకారి అయినను సరే నిలుకడలేని దానిని వెనువెంటనే విడిచిపెట్టుట మంచిది.

## ఆత్మనిగ్రహము

నిధి వంటి దగు నాత్మ నిగ్రహశక్తి,
అది సమకూర్చు శ్రేయస్సు నరులకు. 122

ఆత్మనిగ్రహశక్తి గొప్ప నిధివంటిది; దానిని కాపాడుకో వలెను. అది మానవుని శ్రేయస్సునకు దారి తీయును.

అయిదింటి కాబేలు వలె సంయమించు
నయి జన్మలన్ గూడ నొదవు సౌఖ్యమ్ము. 126

ఒక్క జన్మలో ఎవరైననుసరే కూర్మమువలె పంచేంద్రియములను తమ అదుపులో ఉంచుకోగలుగుదురో అటువంటివారికి తరువాతి ఏడు జన్మలలో కూడ సౌఖ్యములు కలుగును.

చుల్కగా నయమగుచుండగా పుండు
నాల్కచే కాల్చు మాన్పగ వేదెవండు. 129

నిప్పు వలన ఏర్పడిన పుండు సులభముగా మానిపోవును. కాని నాలుక వలన ఏర్పడిన పుండు ఎన్నటికీ మానదు.

## అతిథి సత్కారము

వాకిట నిలుచు నభ్యాగతిన్ మాని
తాకంగ నగునె సుధారసంబేని. 82

ఇంటి వాకిట అతిథు లుండగా, వారిని విడిచిపెట్టి తాను మాత్రము అమృతమును ఆస్వాదింపదలచుట మంచిది కాదు.

అతిథికిన్ బెట్టి తా నవల భుజియించు
నతని క్షేత్రము బీజమందకే మొలుచు. 85

అతిథి సత్కారము కావించునట్టి వాని పొలములో విత్తులు చల్లవలయునా? అక్కర లేదని భావము.

## మధుర భాషణము

అలరి దానము చేయ దలచుటకంటె
కులుకు ముఖమ్ముతో పలుకుటే లెస్స. 92

సహర్షముగా దానము చేయుటకంటె కూడ సంతోషముగా మధురోక్తులు పలుకుట చాల మంచిది.

సంతస మొదలెడు సరసోక్తులాడు
నాతండు దైన్యమ్ము నరయ డెప్పుడును. 94

సంతోషము కలిగించు సరసోక్తులు పలుకువాడు దుఃఖకారణమైన దారిద్ర్యము అనుభవించడు.

లలితోక్తు లుండ దుర్లలితోక్తు లాడ
ఫలము వద్దని కాయ వలచుట చూడ. 100

మంచి మంచిమాటలెన్నో ఉండగా, వాటిని విడిచి పెట్టి పరుషోక్తులు పలుకకూడదు. అట్లు మాటలాడుట తియ్యనిపండు విడిచిపెట్టి పచ్చికాయను తిన్నట్లుగా ఉండును.

## కృతజ్ఞత

అదనున చేయు సాయము కొంచెమైన,
నది లోకమున కంటె నధికమ్ము గాదె. 102

తగిన సమయమున చేయు సహాయము చిన్నదే కావచ్చును. కాని విలువలో అది లోకమునకంటె కూడ పెద్దది.

ఫలము గోరని మేలు తెలిసి కావింప,
కొలదియయ్యు ఫలాన జలధికిన్ గొప్ప. 103

ప్రతిఫలము కోరకుండ చేయు మేలు సముద్రముకంటె కూడ గొప్పది.

మంచివి మరచుట మంచిది కాదు
మంచికానిది వాడె మరచుట మేలు. 108

చేసిన మేలు మరచిపోవుట మంచిది కాదు. మేలు కలిగించని దానిని అప్పుడే మరచిపోవుట మంచిది.

## సత్ప్రవర్తనము

శ్రుతుల మరచిన నేర్చుకొనంగ వచ్చు
పతితుడౌ ద్విజుడు పూర్వగతి నెట్లొందు:

విప్రుడు వేదములు మరచిపోయినను మరల అధ్యయనము చేయవచ్చును. కాని పతితుడైనచో అతని ఆభిజాత్యమే నశించును.

మంచి నడత వంశమర్యాద నిలుపు
కొంచెపు నడత దుష్కులునిగా తెలుపు. 133

సత్ప్రవర్తనము కులగౌరవమును ఎక్కువచేయును; చెడు నడత కులగౌరవమును నశింపజేయును.

## సహనము

తనకు కీడైనను తాల్మియే మేలు
తనను త్రవ్వినవారి ధరణి మన్నించు. 151

తనకు అపకారము చేసినను సహనముతో సంచరించుట మంచిది. తనను త్రవ్వినవారిని కూడ భూమి మన్నించును.

ఒదవు ప్రతికృతిచే ఒకనాటి ముదము,
ఒదవును చిరకీర్తి ఓరిమి వలన. 157

అపకారము చేసినను ఉపకారము చేయుచో ఆ రోజు మాత్రమే సంతోషము కలుగును. కాని అపకారమును క్షమించినచో ప్రపంచము ఉన్నంతవరకును కీర్తి దక్కును.

అహముచేత ఒకండు హాని వల్పినను
సహనాన వానిని సాధింపవలయు. 158

అహంకారముతోడ్డి ఒకడు హాని చేసినను, అతనిని ఓర్పుతో సాధించవలెను.

కుజన దుర్భాషలకున్ తల యొగ్గు
సుజనులే ఆశ్రమస్థులకంటె లగ్గు. 159

చెడ్డవారి కఠినోక్తులను కూడ మన్నించగలవారు సన్న్యాసులకంటెను శ్రేష్ఠులు.

## వ్యర్థభాషణము

నిష్కల్మష జ్ఞాన విధులగు వారు
శుష్కవాక్యమ్ముల జోలికే పోరు. 198

జ్ఞానము కలిగినవారు లాభరహితములైన వట్టి మాటలు పలుకరు.

## పాపభీతి

పాపమ్ము కలిగించు పాపకార్యమ్ము,
పాప మగ్నివి మించి భయకారణమ్ము. 202

పాపపు పనివలన పాపము కలుగును. కనుక అగ్ని కంటెను పాపము భయకారణ మగుచున్నది.

ఏను పేద యటంచు నితరుల కెగ్గు
పూని చేయకు, మీవెపో పేద వగుదు. 205

'నేను పేదవాడను' అనుకొని పాపకార్యము చేయకుము. అందువలన నీవు మరింత పేదవాడ వగుదువు.

తన్ను తాను వలచుకొన్నచో, ఎంత
చిన్న పాపమునైన చేయదతండు. 209

తన్ను తాను నిజముగా ప్రేమించుకొన్నవాడు చిన్న పాపమును కూడ చేయడు.

## ఉపకృతి

ఉపకృతి కన్న మే లొనగూర్చు పని యి
హపరములం గలదా మరి యెందు? 213

పరోపకారము చేయుచు జీవించుటకంటె మంచిపని మరొకటి దేవలోకములో కాని యీ లోకములో కాని లేదు.

అనుకంప గలవాని యధిక సంపదలు
చెనటి వ్యాధుల మాన్పు చెట్లమూలికలు. 217

పరోపకారి యొద్దనున్న సిరిసంపదలు రోగములు పోగొట్టు మూలికల వంటివి.

హిత వెరింగి మనిన బ్రతుకగలండు;
ఇతరుడు మృతులతో జతచేయబడును. 214

హిత వెరిగి జీవించువాడు నిజముగా జీవించినట్లగును. మిగిలినవారు మరణించినవారితో సమానులు.

## వదాన్యత

పేదల ఆకలి పో దొలగింప—
కాదె యది ధవరక్షణ పేయుచోటు. 226

పేదవారి ఆకలిని తీర్చుట ఉన్నవారి కర్తవ్యము. అదే తమ ధనమును జాగ్రత్త చేసికొనెడు స్థలము.

## ఈర్ష్య చెందకుండుట

డెందమునం దీర్ష్య మందుకయినను
చెందకుండుట మంచి శీలమ్ముగాదె. 162

మనస్సులో మందుకైనను అసూయపడకుండ సంచరించుట నిజముగా సచ్ఛీల మగును.

పరుల సంపద కీర్ష్యపడువాని గృహముఁ
దొరగి, అక్కకొసంగి సిరిజారు నిజము. 167

ఇతరుల సంపదను చూచి ఈర్ష్య చెందువాని గృహము నుండి లక్ష్మి తప్పుకొనును. పోవుచు పోవుచు తన స్థానములో తన అక్క అయిన పెద్దమ్మను (దరిద్రదేవత) ఉంచి పోవును.

చాల చిత్రము దయాశాలికొ లేమి
క్రాందే కడుపుబ్బరపు వాని కల్మి. 169

మంచివాని లేమిని, మలిన మనస్కుని కలిమిని చూచి దీర్ఘముగా ఆలోచింతురు. ఇది చిత్రము గదా!

## అన్యాయార్జితము

పరవిత్త మాశించి హరియింపకుంట
వర, మద్దికాక చేకురు ధనం బింట. 180

పరుల విత్తమును ఆశించకుండుటయే శ్రేష్ఠము. అందు వలన తనయొద్ద ఉన్నధనము అభివృద్ధి యగును.

## మాంస విసర్జనము

వ్రతిన జీవుల జంపి పలలమ్ము దినవి
వ్రతము మే లది; శతక్రతుతుల్య మవవి. 259

ప్రాణులను చంపి వాటి మాంసము తినకుండుట అనునది ఎన్నో యజ్ఞములు చేయుటకంటెను మంచిది.

ప్రాణివధయు, మాంసభక్షణ దొరగు
మానవీయుడు లోకమాన్యుడై పరగు. 260

ప్రాణివధయు, మాంసభక్షణము చేయనివాడు లోకముచేత పూజ లందుకొనును.

## తపస్సు

బాధ నోర్చుకొనుట, పరుల నెవ్వరును
బాధ పెట్టమియు తప మనంగవచ్చు. 261

కష్టములను సహించుట, ఇతరులకు కష్టములు కలిగింపకుండుట– ఇదే తపస్సు అనవచ్చును.

తప్తకాంచనమట్లు తపసి బాధాగ్ని
తప్తుడై రాజిల్లు తపముచే నవని. 262

తపస్సువలన కలుగు బాధలను ఎవడు సహించుకొనునో అతడు తప్తకాంచనమువలె (శుద్ధి చేయబడిన బంగారము) ప్రకాశించును.

## దుశ్శీలము

తాపసుల్ తమ పని తగఁజేయువారు;
ఆపదల్ కలఁగును ఆశలో పడిన. 266

తపస్సు చేయువారే తమ విధ్యుక్తధర్మము నెరవేర్చువారు. కడమ వారందరు ఆశలకు లోనై వ్యర్థ ప్రయత్నములు చేయుచున్నారు.

ముని వేషమున నైచ్యములు సల్పువాడు
వని మృగాళి వధించి మనుబోయవాడు. 274

మునివేషము ధరించి పాపకార్యములు చేయువాడు దొంగతనముగా మృగములను వేటాడునటువంటి బోయవాడు.

## వంచనము

జనుల వంచించి చేర్చిన సొమ్ము వృద్ధి
దనరి నట్లుండి మొత్తము పోవునద్ది. 283

వంచనచేత గడింపబడిన సొమ్ము వృద్ధి అగుచున్నట్లే కనిపించును; కాని అది చివరికి పోవును.

## సత్యము

మనసార సత్యమ్ము మాటాడు నతడె
ఘనుడు—తాపసియైన పెనుదాత కంటె. 295

మనస్ఫూర్తిగా నిజము చెప్పువాడు దానకర్ణుడైన తపస్వికంటె కూడ గొప్పవాడు.

వెలుపలి శుభ్రత జలముచే కలుగు;
కలుగు నంతశ్శుద్ధి పలుకుల వలన. 298

స్నానము చేయుటవల్ల బాహ్యశుద్ధి కలుగును. సత్యము చెప్పుటవల్ల అంతశ్శుద్ధి కలుగుచున్నది.

దీపాలు కావెల్ల దీపాలు, సత్య
దీపమ్మె దీపమ్ము ధీరాత్ములకును. 299

బయట అలముకొన్న చీకటిని పోగొట్టు దీపాలు దీపాలు కావు. బుద్ధిమంతులకు తమ లోపల అలముకొన్న చీకటిని పోగొట్టు సత్య దీపమే నిజమైన దీపము.

కనులార మేము గాంచిన వస్తు వికర
మున లేదొకటి సత్యమునకంటె మిన్న. 300

మేము చూచిన వస్తువు లన్నిటిలోను సత్యమును మించిన వస్తువేదియు కనిపించలేదు.

అలుగమి

పెను మంటవలె హాని యొనరించినను, ఆ
తనిపై వహింపకు కినుక; మంచిదది. 308

పెద్ద మంటవంటి కష్టమును ఒకడు నీకు కలిగించినను, వీలయినచో అతనిని కోపగించుకొనకుండ సంచరించుట మంచిది.

మృతులతో సములౌదు రతికోపమతులు
యతులతో సములు విగతకోపధనులు. 310

క్రోధమనస్కులు మరణించినవారితో సమానము. కోపము లేనివారు యతులతో సమానులు.

## హాని తలపెట్టమి

తాను తెలిసికొన్న తగని కార్యముల
తా నొరులకు చేయదలపమి మేలు. 316

స్వానుభవముద్వారా మంచివి కావని తెలిసికొన్న వాటిని ఇతరులకు చేయకుండుట చాల మంచిది.

వేటి ప్రొద్దున నొక్కడికి నొంతువేని
వాటి నందెకె నీకు వాటిల్లు హాని. 319

ప్రొద్దున ఒకని మనస్సు నొప్పించునట్లుగా ప్రవర్తించినచో, సాయంకాలమే అతడు బాధకు గురి అగును.

## అహింస

హింస వలుపమి అహింస ధర్మమ్ము
హింస కారణ మన్ని దోషములకును. 321

హింస చేయకుండుటయే గొప్ప ధర్మము. ఎందుకనగా, అన్ని దోషములకును హింసయే కారణమగుచున్నది.

పంచుకొని తినుట, ప్రాణి జీవనము
పెంచుట—మంచివి; ఎంచి చూడంగ. 322

ధర్మశాస్త్రజ్ఞుల దృష్టిలో ఇతరులకు పెట్టి తాను భుజించుటయు, హింస చేయకుండుటయు చాల మంచివి.

చాల మంచిది అహింసయె; అటు పిదప
చాల మంచిదగును సత్యభాషణము. 323

అహింస చాల మంచిది. ఆ తర్వాతనే నిజము చెప్పుట మంచి గుణము.

## అస్థిరత

నిదురకున్ జనుట వంటిది మరణమ్ము
నిదుర మేల్కొనుట వంటిది జననమ్ము. 339

నిద్రపోవుట వంటిది మరణము. ఆ నిద్రనుండి లేచుట వంటిది జననము.

## పరోక్షనింద

మును పరదోషముల్ కనుగొన దలప
మనుజుండు తన తప్పులను తెల్పుకొనుట. 186

ఇతరుల తప్పులను ప్రకటింపదలచెడువాడు, తన తప్పులను తానే ప్రకటించుకొని నట్లగును.

చిరునవ్వు లొలుక భాషింపనివాడు
విరసమ్ము లాడుచు చెరచు స్నేహమ్ము. 187

నవ్వుమొగముతో మాటలాడి స్నేహము నభివృద్ధి చేసికొనినవాడు, 'పగను పెంచు మాటలు పలికి స్నేహము నకు భంగము కలిగించును.

## కోరిక లేకుండుట

కోరిక పట్టుమ కోరుచో, ఇరుమ
కోరునే తన పట్టు కూల్ద్రోయంగ. 347

మానవుడు కోరికలకు బానిసగా ఉన్నంతకాలము, కష్టములు కూడ తమ పట్టును సడలించుకొనుటకు ఇష్ట పడవు.

వాంఛ లేవి యతవి వాంఛింపవలెను,
వాంఛ విసర్జింప వాంఛింపవలెను. 350

వాంఛారహితుడైన ఆ భగవంతుని కోరవలెను. అటులనే వాంఛను విడిచిపెట్టవలె నను వాంఛను కోరవలెను.

## జ్ఞానము

సందేహము దొరగి స్వచ్ఛమౌ జ్ఞాన
సందీప్తులకు దివి చాల దూరమ్మె! 353

సందేహములనుండి బయటపడి నిర్మలమైన జ్ఞానము కలిగిన వారికి భువికంటె దివియే చాల దగ్గర.

ఆశయు, క్రోధమోహములు తొలగిన
మాపిపోవను దుఃఖరాశియు నపుడు. 360

కామ క్రోధ మోహములు కనుక తొలగినచో, అప్పుడు మానవుని దుఃఖములు కూడ తొలగిపోవును.

## కోరిక చంపుకొనుట

కోరుము జన్మ లేకుండుట, అదియు
కోరిక తొలగుచో కూడివచ్చు గదః 362

కోరవలసినది ఏదైనను కలదన్నచో, అదియే జన్మ రాహిత్యము. ఆ కోరిక కూడ కోరికలు చంపుకొన్నప్పుడే కలుగునని భావము.

కోరిక లేనిచో తీరును వెతలు
కోరిక లున్నచో కూడివచ్చు నవి. 368

కోరికలు లేనివారికి దుఃఖములు లేవు. అవి కనుక ఉన్నచో, దుఃఖములు ఎక్కువగా కలుగును.

## విధి

ఒదవు దీక్షశక్తి విధి మంచిదైన
ఒదవు బద్ధకముపో విధి చెడ్డదైన. 371

విధి కనుక మంచిదైనచో కార్యదీక్ష అలవడును; అది కనుక చెడ్డదైనచో సోమరితనము కలుగును.

తుదముట్ట శాస్త్రముల్ చదువంగ వచ్చు
తుద కబ్బు జ్ఞానమ్ము విధిబట్టి గాదె. 373

అన్ని శాస్త్రములను ఆపోశనము పట్టవచ్చుగాక! అయినను విధి నిర్ణయము ప్రకారము తుదకు జ్ఞానము నిలుచును.

విధి నిర్ణయించిన విధముగా కోట్ల
విధులున్న వారును నెగడవలయును. 377

కోట్లకొద్ది ధనమున్నవారు కూడ విధి నిర్ణయించిన ప్రకారమే జీవితము సాగించవలెను.

## అర్థఖండము

రాజు

దానము, ధైర్యము, తరగని దీక్ష,
జ్ఞానము—కావలె జనపతి కెపుడు. 382

దానము, ధైర్యము. కార్యదీక్ష, జ్ఞానము - అను ఈ నాలుగును రాజులో ఉండవలెను.

గడనయు, జతనము, కాచుటయు మరి
గడన వెచ్చించుట—ఒడయని పనులు. 386

ప్రయత్నించుట, గడించుట, గడించిన దానిని రక్షించుట, ఆ రక్షించిన దానిని చక్కగా వ్యయము చేయుట రాజు చేయవలసిన పనులు.

కినుక దెప్పు పలుకులను గూడ సైచు
జనపతి గొడుగు నీడను వసించు భువి. 389

కోపము కలిగించు మాటలను కూడ మన్నింపగల రాజు గొడుగు క్రింద లోకము నివసింపదలచును.

దయయు, వదాన్యత, ధర్మరక్షణ, ప్ర
జమెడ ప్రేమ—కల భూజాని వెలుగగు. 390

దయ, దాతృత్వము, ధర్మబుద్ధి, ప్రజలయెడ ప్రేమ కలిగిన రాజు రాజలోకమునకు ఒక వెలుగుగా ఉండును.

## విద్య

నేర్చుట మంచిది నేర్వదగినవి
నేర్చినట్లు నడత నిల్చుట మేలు. 391

నేర్వదగినవాటిని క్షుణ్ణముగా నేర్వవలెను. అటు పిమ్మట నేర్చినట్లుగా నడత కొనసాగవలెను.

కలవు కండ్లు చదువు గలవారికివి, మి
గిలిన వారికి పుండ్లు కలవు మొగాన. 393

విద్యావంతులే కండ్లు కలవారగుదురు. ముఖమున రెండు పుండ్లున్నవారు విద్యావిహీనులు.

తమ చమువువలన తాము, జగతి ము
దము బొంద, వలతురు దానినే వారు. 399

తమ చదువు సంధ్యల వలన తమకే కాక, అందరికిని సంతోషము కలిగినచో, చదువుకొన్నవారు ఆ చదువునే (ఇంకను చదువవలెనని) అభిలషింతురు.

## విద్య నేర్వమి

చదువని వాడును చతురుడే, అతడు
మెదపకూడదు నోరు చదువరి ముందు. 403

చదువుకొననివారు కూడ చతురులే! కాని వారు చదువుకొన్నవారి మధ్య నోరు విప్పకూడదు.

చదువుకొనని కుల సంపన్ను కన్న
చదివిన ఆ హీన జన్ముడు మిన్న. 409

చదువుకొనని ఆభిజాత్య సంపన్నునికంటె చదివిన వాడు, తక్కువ కులమువాడైనను, శ్రేష్ఠుడని భావము.

## సద్బుద్ధి

విననగు నెవరు చెప్పిన, సత్య మరసి
కనవలె, సద్బుద్ధి యన వేరె కలదె। 423

ఎవరెవరు ఏమి చెప్పినను విని, ఆ మాటలలోని సత్యమును గ్రహించుటయే సద్బుద్ధి అగును.

జగతి యే విధమున చరియించు: అటుల
జగతితో తాను సాగుచే తెలివి. 426

లోకము ననుసరించి మనుగడ సాగించుటయే సద్బుద్ధి.

## తప్పు దిద్దుకొనుట

తనను తాను పొగడుకొనరాదు, మంచి
యొనగూర్చని పనుల నొనరింపరాదు. 439

రాజు తనను తాను పొగడుకొనకూడదు. నిరుపయోగములైన పనులు చేయకూడదు.

## సజ్జన మైత్రి

మొదలు లేకున్న ఎల్లొదవు లాభమ్ము
ఒదవు స్థైర్యమ్ము సహృదయులవలన. 449

మొదలు లేనిచో లాభము కలుగదు. అటులనే ఏకాభిప్రాయులైన వారి తోడ్పాటు లేకున్నచో రాజు స్థిరముగా ఉండలేడని భావము.

పలువురి పగ మేలు, అల సత్పురుషుని
చెలిమిని విడనాడ దలచుట కంటె. 450

సజ్జనసాంగత్యమును విడనాడుటకంటె, పలువురితో పగపెంచుకొనుట మంచిది.

## తగిన తరుణము

పగలు దివాంధమును గెలుచు కాకి;
తగినవేళ గెలుచు పగవాని రాజు. 481

పగటిపూట గుడ్లగూబను కాకి జయించును. అటులనే తగిన సమయము చూచి రాజు తన వైరిని జయింపవలెను.

అరుదైన అవకాశ మరుదెంచెనేని
అరుదైన కార్యమ్ము నాచరింపవలె. 489

ఒక గొప్ప అవకాశము కనుక లభించినచో, అందుకు తగినట్లుగా ఒక గొప్ప పనిని చేయుట మంచిది.

## మంచి ప్రభుత్వము

వినువీధి జూచి జీవించు ప్రజలను
మనుదురు ప్రభుదండమును జూచి గాదె. 542

వర్షార్థము ఆకాశమువంక చూచుచు జీవించువారు (కర్షకులు)కూడ ప్రభు దండమును చూచి (న్యాయసమ్మతమైన దొరతనము) జీవించుచున్నారు.

## పురుష ప్రయత్నము

అదురుము, అలపట వదిలినవారు
విధిని త్రిప్పగలరు వెనుకవైపునకు. 620

నిర్భయముగాను, అలసట ఎరుగకుండగను తలపెట్టిన పనిని చేయువారు విధిని కూడ వెనుకకు త్రిప్పగలరు.

జతనమున గలుగు చాల భాగ్యమ్ము
జతనము లేకున్న సంపద చెడును. 616

ప్రయత్నము (కృషి) వలన సంపద కలుగును. ప్రయత్నము లేకున్న సంపద చెడును.

### కష్టములు గెలుచుట

ఇడుమ విడుమ పరచెడు మహాధీయు
లిడుమల బడినను ఇడుమల బడరు. 623

ఒక పనిని చేయునప్పుడు మధ్య ఆటంకములు వాటిల్లినను, వాటిని చూచి చలింపనివారు ఆ ఆటంకములకు ఆటంకములు కలిగింతురు.

కలత మాని నగుము కష్టమేర్పడిన,
మొలక నవ్వులె ఇక్కటుల దీర్చు విజము. 621

కష్టములు కలుగుచో నవ్వుము. ఆ నవ్వే కష్టమును తొలగించును.

### మాటల శక్తి

జంకు, ఏమరుపాటు లేక యుక్తముగ
వాక్శూరు వాని కపజయమ్ము లేదు. 647

తాను చెప్పదలచిన విషయమును జంకు, ఏమరుపాటు లేకుండ యుక్తియుక్తముగా చెప్పగలుగు వానిని ఎవ్వరును జయింపలేరు.

## దేశము

ఆకలి, శత్రుభయమ్ము, వ్యాధులును
లేక శేశము వర్ధిలిన దేశమగును. 734

తీరని ఆకలియు, శత్రు భయమును, మొండి వ్యాధులును లేని దేశమే దేశము.

## మనసు పసిగట్టుట

దరి నున్నయది తెల్పు దర్పణము మట్లు
అరయంగ జేయు ముఖమ్ము మనసును. 706

చెంతనున్న వస్తువులను అద్దములో చూడవచ్చును. అటులనే మనస్సును ముఖముద్వారా పసిగట్టవచ్చును.

## ధనమునకు గల ప్రాముఖ్యము

అర్థవిహీనుల నాదరింతురొకో?
అర్థము గలవారి నాదరింత్రు మరి. 752

అర్థవిహీనులను ఆదరింపరు, అర్థమున్నవారిని ఆదరింతురు.

## పగ

తెలుపకు నీ బాధ చెలికాండ్రకైన
బలము లేమివి శాత్రవులకు తెల్పకుము. 877

నీ బాధను నీ మిత్రులకు కూడ (వారికి తెలియకున్నచో) తెలుపకుము. అటులనే నీ బలహీనతను నీ శత్రువులముందు ప్రదర్శింపకుము.

ఛేదింపవలె ముండ్ల చెట్టు; లేకున్న
ఛేదించువో తానె ఛేదించువాని. 879

ముండ్ల చెట్టును, లేతగా ఉన్నప్పుడే, ఛేదింపవలెను. పెరిగిన పిమ్మట అది ఛేదించువాని చేతినే ఛేదింప (నరుక) గలదు.

## జారత్వము

వెలకాంత కౌగిలి—వింత శవమ్ము
వెలుగు లేనిగది కౌగిలి చేర్చుకొనుట. 913

వెలకాంత కౌగిలి యెటువంటిదనగా, తెలియని శవమును చీకటి గదిలో కౌగిలించుకొనుట వంటిది. ఆమెకు ధనమే కాని వలపు ముఖ్యము కాదనుట.

అన్న వస్త్రములను, యశము, విద్య, సిరి
మన్నయగును గాదె జూదరి కెపుడు. 939

అన్న వస్త్రములు, కీర్తి, చదువు, సంపద—వీటిని ఆర్జింపవలయు నను ఆశ జూదగానికి ఉండదు.

## ఆభిజాత్యము

మొలకచే భూసారము గ్రహింపవచ్చు
పలుకుచే నరుని సత్కులం మెన్నవచ్చు. 959

మొలకను బట్టి భూసారమును గ్రహింపవచ్చును. అట్లనే మాటను బట్టి ఆభిజాత్యమును గ్రహింపవచ్చును.

కనుపట్టుగా కులీనుని కళంకమ్ము
కనుపట్టినటుల చంద్రుని కళంకమ్ము 957

చంద్రునిలోని నల్లని మచ్చలు కనిపించినంత స్పష్టముగా కులీనుని దోషములును కనిపించును.

## సౌజన్యము

పరమ ధర్మము ప్రాణివధ వల్పకునికి,
పరదోషముల్ తెలుపక యుంట మేలు. 984

అహింసయే ఉత్తమ ధర్మము. అటులనే పరదోషములు తెలుపకుండుట ఉత్తమము.

## వ్యవసాయము

చేను దున్నెడువారె జీవించువారు
కాని తక్కొరు వారిగడన కాంత్రు. 1033

పొలము దున్ని జీవించువారే జీవించువారు. కడమ వారు వారిపై ఆధారపడినవారు.

ఏ విధి బ్రతుకని యేడ్చు కర్షకుని
భావించి పొలమను పడతి హసించు. 1040

నా మనుగడ ఎట్లు సాగునో అనుకొని సోమరిగా వ్యవహరించు కర్షకుని చూచి పొలమనెడు స్త్రీ నవ్వును.

## దారిద్ర్యము

కనుమూయ వచ్చును పెనుమంట నడుమ
కనుమూయ దరమె లేమిని మ్రగ్గువేళ. 1049

మంటల మధ్య నిద్రపోవచ్చునేమో గాని పేదరికముతో బాధపడుచు నిద్రపోవుట కష్టమని భావము.

# కామఖండము

## ప్రేమ

పసిడిబొమ్మయొ, వేల్పు పల్లవాధరియొ,
వసమించు నెమలియొ వచియింపదరమె? 1081

ఆమె బంగారు బొమ్మయో, దేవతా స్త్రీయో, అందాల నెమలియో యెవరో చెప్పలేకున్నాను—అని అతడు అనుకొనుచున్నాడు. అతడు అనగా ప్రియుడు. ఆమె అనగా ప్రేయసి.

మిత్తి యెట్టిదొ కాని మృత్యువే యింతి
నెత్తమ్మిరేకుల నేత్రాల మూర్తి. 1083

నాకు మృత్యువనగా ఏమో తెలియదు. నెత్తమ్మి రేకుల నేత్రములు కల స్త్రీయే మృత్యువని నుడువదగును.

పూవి ద్రాక్షాసవం బానగా తీపి
కాని ప్రేమరసమ్ము కవినంత తీపి 1080

ద్రాక్షాసవము ఆస్వాదించినచో మధురముగా ఉండును. కాని ప్రేమ రసము, చూచిన మాత్రముననే, మధురముగా ఉండును.

నేను చూచిన తాను నేలను చూచు
నేను చూడని వేళ తాను చూచి, నగు. 1094

నేను చూచినప్పుడు ఆమె నేలను చూచును. నేను చూడనప్పుడు ఆమె నన్ను చూచి, చిరునవ్వు నవ్వును.

## విరహము

కరినున్న యప్పు డాతనిలోవి తప్పు
లరయదోపవు, లేవి యపు డొప్పు తప్పు. 1286

అతడు దగ్గర ఉన్నప్పుడు అతనిలో నాకు తప్పు లేమియు కనిపింపవు. అతడు దగ్గర లేనప్పుడు అతనిలో నాకు అన్నియు తప్పులే కనిపించును.

సదమల ప్రేమ పుష్పము కంటె మృదులం,
మది గ్రహించి ధరించు ముదితాత్మ లరిది. 1289

ప్రేమ పుష్పముకంటెను చాల మృదులము. ఆ విషయమును గ్రహించినవారు చాలమంది లేరు.

## ప్రణయ కలహము

తిన్నది అరుగుచో తియ్యన: ప్రేమ
కన్నను విరహమ్ము ఎన్నగా మేలు. 1326

ఎక్కువగా తినుటకంటె తిన్నది అరిగినచో చాల మంచిది. అటులనే ప్రేమ ననుభవించుటకంటె విరహమే మంచిది. సంభోగ శృంగారముకంటె విప్రలంభ శృంగారము మేలని భావము.

మధురిమ కూర్చు ప్రేమకు కలహమ్ము:
అది మరింత యగును ఆలింగనమున. 1330

ప్రణయకలహము వలన ప్రేమకు మాధుర్యము కలుగును. ఆవల ఆలింగనము వలన ఆ కలహమునకు మరింత మాధుర్య మేర్పడు నని భావము.

## విరహము

తరినున్న యప్పు డాతనిలోని తప్పు
అరయదోపవు, లేని యపు డొప్పు తప్పు. 1286

అతడు దగ్గర ఉన్నప్పుడు అతనిలో నాకు తప్పు లేమియు కనిపింపవు. అతడు దగ్గర లేనప్పుడు అతనిలో నాకు అన్నియు తప్పులే కనిపించును.

పదమల ప్రేమ పుష్పము కంటె మృదులం,
మది గ్రహించి తరించు ముదితాత్ము లరిది. 1289

ప్రేమ పుష్పముకంటెను చాల మృదులము. ఆ విషయమును గ్రహించినవారు చాలమంది లేరు.

## ప్రణయ కలహము

తిన్నది అరుగుచో తియ్యన: ప్రేమ
కన్నను విరహమ్ము ఎన్నగా మేలు. 1326

ఎక్కువగా తినుటకంటె తిన్నది అరిగినచో చాల మంచిది. అటులనే ప్రేమ ననుభవించుటకంటె విరహమే మంచిది. సంభోగ శృంగారముకంటె విప్రలంభ శృంగారము మేలని భావము.

మధురిమ కూర్చు ప్రేమకు కలహమ్ము:
అది మరింత యగును ఆలింగనమున. 1330

ప్రణయకలహము వలన ప్రేమకు మాధుర్యము కలుగును. ఆవల ఆలింగనము వలన ఆ కలహమునకు మరింత మాధుర్య మేర్పడు నని భావము.